ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు
గురువారం 4 డిసెంబరు 2025



'సోమశిల'కు నిలకడగా వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అంతగా లేకపోవడంతో సోమశిల జలాశయానికి ఆశించినరీతిలో వరద రావడం లేదు. గడిచిన నాలుగు రోజులుగా 20 వేల క్యూసెక్కుల దిగువనే ప్రవాహం కొనసాగుతోంది మంగళవారం 12,288 క్యూసెక్కులు వస్తుండగా బుధవారం సాయంత్రం 13,464 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 70.514 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.



నెల్లూరు: అయ్యప్పగుడి వద్ద వాహనదారుల అవస్థలు



వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు



బుజబుజనెల్లూరులోని ఊరకుంట చెరువుకు పడిన గండి

తగ్గినట్టే తగ్గి... ముంచెత్తింది!

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నెల్లూరుపై తీవ్రప్రభావాన్ని చూపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షం తాకిడికి నెల్లూరు జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. నగర శివారు ప్రాంతం బుజబుజనెల్లూరు, తల్పగిరికాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ తదితర ప్రాంతాలు ఉడుముల వాగు ఉధృతికి నీటమునిగాయి. పైనుంచి వచ్చిన వరద నీరు ఈ ప్రాంతాలలోని రోడ్లు, ఇళ్లను చుట్టుముట్టాయి. అయ్యప్పగుడి కూడలి వద్ద వరద భారీగా చేరుకోవడంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలుకు ఇబ్బంది ఏర్పడింది. పలు వాహనాలను దారి మళ్లించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని బయటకు పంపారు. ఇదే దుస్థితి బుజబుజ నెల్లూరులోనూ ఏర్పడింది. రెవెన్యూ కాలనీ వద్ద నీటిని బయటకు పంపేందుకు యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్, రామలింగాపురం ప్రాంతాల్లోని అండర్ బ్రిడ్జిలు నీటమునిగాయి. దీంతో ఈ మార్గాలలో కొన్ని గంటలపాటు వాహన రాకపోకలను ఆపేశారు. భారీ యంత్రాలతో ఇక్కడ నీటిని బయటకుతోటి యథాస్థితికి తీసుకువచ్చారు. గాంధీబొమ్మ, వీఆర్సీ, పొగతోట, జేమ్స్‌గార్డెన్, రామ్మూర్తినగర్, సుబేదార్‌పేట ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. ఈ ప్రాంతాల్లోని మురుగు కాలువల సామర్థ్యం సరిపోకపోవడంతో మధ్యాహ్నం వరకు సాధారణ స్థితి కనిపించలేదు. ఇక రంగనాయకులపేట, పాతమున్సిపల్ ఆఫీస్, మనుముసుద్దీన్‌నగర్, కోటమిట్ట, ఇరగాలమ్మ సంఘం, కేవీఆర్‌కూడలి వద్ద భారీగా నీరు చేరింది. ఇదే దుస్థితి మాగుంటలేఅవుట్, గోమతినగర్, రవీంద్రనగర్‌లోనూ కనిపించింది. అటు నగరానికి ఉత్తారానున్న భగత్‌సింగ్‌కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాలు నీటి ముప్పును ఎదుర్కొన్నాయి. వైఎస్‌నగర్, ఆదిత్యనగర్, జనశక్తినగర్ ప్రాంతాలు రోడ్లు కనిపించనంతగా వర్షపునీరు చేరింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలో వాహన రాకపోకలు నిలిచాయి. కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



నెల్లూరు రూరల్ : సౌత్‌మోపూరులో మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని తోడుతున్న కార్మికులు

● నాయకులు, అధికారుల సాయం

నెల్లూరులో వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు అధికార పార్టీ నాయకులు, మున్సిపల్, పోలీసు యంత్రాంగం రోడ్డెక్కింది. ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్ తన బృందాలతో నీట మునిగిన కాలనీలు, రోడ్లు, కాలువల వద్ద పరిస్థితి పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వరద ప్రవాహాన్ని బయటకు పంపారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుజబుజనెల్లూరు, నేతాజీనగర్, కొత్తూరు, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ ప్రాంతాలలో పర్యటించారు. అధికారులతో కలిసి యంత్రాలతో కాలువల్లో పూడికతీసి నీటిని మళ్లించారు. 19 ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిన కార్పొరేషన్ అధికారులు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్దనున్న చవటమిట్ట గిరిజన కాలనీ, నాగమ్మకాలనీ, నేతాజీనగర్, రామకోటయ్యనగర్ ప్రాంతాలలోని నీట మునిగిన నివాసాలకు ఆహార పదార్థాలను అందచేశారు.

● అలాగే నెల్లూరురూరల్‌లోని పంట పొలాలన్నీ నీట మునగగా, నారుమళ్లు గల్లంతు అయ్యాయి. పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహన రాకపోకలను కొన్ని గంటల పాటు అధికారులు ఆపేశారు. సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట గ్రామాలలో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆయా గ్రామాలలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



నెల్లూరు : ట్రాక్టర్ మునిగి పోయింది. ఇప్పుడెలా!?



నెల్లూరు : ఉప్పొంగిన వాగు..



నీట మునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి



నెల్లూరు : ఇంటిలో నుంచి బయటకు వచ్చేదెలా!?

'దిత్వా' ప్రభావంతో రాత్రంతా భారీ వర్షం
చిగురుటాకులా వణికిన నెల్లూరు నగరం
మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరులోనూ అంతే!
తెగిన చెరువులు.. ఉప్పొంగిన వాగులు
రహదారులపైకి దూసుకొచ్చిన వరద
వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

దిత్వా తుఫాన్ ముప్పు తప్పిందిలే అనుకున్నారంతా. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా వరుణుడూ తెరపివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. చిరుజల్లులతో ప్రారంభమైన వాన మోస్తరు.. ఆ తర్వాత భారీగా కురిసింది. రాత్రి 9 గంటల నుంచి బుధవారం ఉదయం దాకా తెరపివ్వకుండా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా సరాసరి 3.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదవగా అత్యధికంగా వెంకటాచలంలో 21.4 సెం.మీ, మనుబోలులో 15.4 సెం.మీ, ముత్తుకూరులో 12 సెం.మీ, నెల్లూరు నగరంలో 9.6 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగగా, రహదారులన్నీ జలదారులుగా మారిపోయాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని చాలా ప్రాంతాలు నీట మునగడంతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. అలాగే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై వరద పోటెత్తడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. సౌత్‌మోపూరు సమీపంలో మొగళ్లపాలెం చెరువు తెగిపోయింది. కోవూరు మండలంలో సదరన్ ఛానల్‌కు గండి పడింది. ఇక భారీ వర్షాలు, వరదలతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో సాగు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

చెన్నై హైవేపై వరద

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి పోటెత్తిన వరదతో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి నిండిపోయింది. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్లే రహదారిపైకి వరద ఉధృతంగా చేరడంతో వాహనాలు నిలిపి వేశారు. అలాగే వెంకటాచలం సమీపంలో గూడూరు వైపు వెళ్లే జాతీయ రహదారి మీద కూడా వరద భారీగా చేరడంతో చెరువును తలపించింది. హైవేపై వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం వేకువజాము నుంచి జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. అధికారులతో కలిసి పోలీసులు అప్రమత్తమై జేసీబీ సహాయంతో నీటిని పారద్రోలే చర్యలు చేపట్టారు. ఒకే మార్గంలో వాహన రాకపోకలు నెమ్మదిగా సాగాయి. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో రెండు మార్గాల్లోనూ వాహనాలను పునరుద్ధరించారు. అలాగే కంటేపల్లి - గొలగమూడి, గూడ్లూరువారిపాళెం - తిరుమలమ్మపాళెం గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టారు. కురిచెర్లపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మోకాలి లోతు వర్షపు నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కలుజు చెక్కలను ఎత్తివేసి వరదను దిగువకు వదిలి వేశారు. అధికారులతో కలిసి టీడీపీ నేతలు, కార్యకర్తలు తమవంతు సహాయక చర్యలు చేపట్టారు.



చెముడుగుంట వద్ద హైవే పైకి చేరిన వరద



మనుబోలు : పొదలకూరు రోడ్డుపై పొట్టేళ్ళవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పహారా కాస్తున్న పోలీసులు

తీరప్రాంత గ్రామాల్లో అవస్థలు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వానకు మనుబోలు మండలం వణికిపోయింది. కండలేరు వాగు పొంగడంతో మనుబోలు-గూడూరు మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే పొట్టేళ్ళ కాలువ పొంగి గొట్లపాళెం వద్ద మనుబోలు-పొదలకూరు మార్గంలోకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే వెంకన్నపాళెం వద్ద వాగులు పొంగి రోడ్డుపైకి నీరుచేరి 5 తీరప్రాంత గ్రామాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఇక పొట్టేళ్ళ వాగు ఇటు కొమ్మలపూడి రైల్వేబ్రిడ్జి కింద నిండుగా ప్రవహిస్తుండటంతో కొమ్మలపూడి, చెరుకుమూడి, ముద్దమూడి గ్రామాలకు వెళ్ళేందుకు దారి లేకుండా పోయింది. దారులన్నీ మూసుకుపోవడంతో బయట ప్రాంతాలకు రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడ్డారు. వందలాది ఎకరాల్లో నార్లు, నాట్లు మునిగిపోయాయి. కయ్యల్లో మోకాలి లోతు నీరు ఉండటంతో ఇక నార్లు, నాట్లు పనికిరావని అన్నదాతలు వాపోతున్నారు.

కావలిలో స్తంభించిన జనజీవనం

కావలి, (ఆంధ్రజ్యోతి) : బుధవారం ఉదయం గంటపాటు కురిసిన వర్షానికి కావలిలో జనజీవనం స్తంభించింది. ఇటీవల మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఇప్పుడు దిత్వా ప్రభావంతో కురిసిన వర్షాలకు పట్టణంలో అనేక రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రధానమైన ట్రంకు రోడ్డుతోపాటు జాతీయరహదారిగా ఉన్న కావలి-ఉదయగిరి రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడితున్నారు. ఇక వైకుంఠపురంలోని అన్నపుగుంటను వరద ముంచెత్తడంతో తూముల వద్ద పెద్ద గుంతలు పడ్డాయి. నీటి ప్రవాహంలో ఆ గుంతలు కనిపించకపోవటంతో ఆ మార్గంలో రాకపోకలను ఆపివేశారు. ఇలా పట్టణంలోని అనేక లోతట్టు ప్రాంతాలతోపాటు మద్దూరుపాడు లోని టిడ్కో గృహవాసులకు కూడా నీటి ముంపు సమస్య తప్పలేదు.



కావలి : అన్నపుగుంట చాకలివీధి వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన కంప



సంగం : పల్లిపాళెం పాఠశాల ఆవరణలో వర్షపునీరు

507 హెక్టార్లలో నీటమునిగిన వరినాట్లు

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతోపాటు కాలువల్లో పొంగి పొర్లుతున్న వరద కారణంగా జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రానికి సుమారు 507 హెక్టార్లలో వరినాట్లు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాకొచ్చింది. అదేవిధంగా 116 హెక్టార్లలో వరినారు కూడా నీటిలో మునిగింది. అత్యధికంగా కావలిలో 174 హెక్టార్లలో వరినాట్లు, 49 హెక్టార్లలో వరినారు మునిగినట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు మండలంలో 124 హెక్టార్లలో వరి, 6 హెక్టార్లలో వరినారు, బుచ్చిరెడ్డిపాళెంలో 100 హెక్టార్లలో వరి, 20 హెక్టార్లలో నారు, కోవూరులో 48 హెక్టార్లలో వరి, 9 హెక్టార్లలో నారు, కొడవలూరులో 24 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారుమడి, సంగంలో 20 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారు, బోగోలులో 17 హెక్టార్లలో వరి, 12 హెక్టార్లలో నారు నీట మునిగినట్లు అంచనా వేశారు. ఈ ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో దాదాపు 439 మంది రైతులకు చెందిన 507 హెక్టార్లలో వరి నీట మునిగిందనేది వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా.



చెరువు కాదండీ... మనుబోలులోని పంట పొలాలు

నేడు డీడీవో కార్యాలయాల ప్రారంభం



నెల్లూరులోని జడ్పీ కార్యాలయ ఆవరణలో నిర్మించిన డీడీవో కార్యాలయం

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిపాలనను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీడీవో) వ్యవస్థకు కార్యాలయాలు గురువారం ప్రారంభమవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 77 డీడీవో కార్యాలయాలను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో 5 డివిజన్లు ఉండగా 5 కార్యాలయాలు ఏర్పాటు చేశారు. వీటిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వర్చువల్‌గా గురువారం ప్రారంభిస్తున్నారు. దీంతో జిల్లాలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి పాలన ఇకనుంచి కొత్త కార్యాలయాల నుంచి ప్రారంభం కానుంది.



పాండురంగస్వామి ఆలయంలో సమావేశమైన టీడీపీ నాయకులు

తిరుపతి వద్దు.. నెల్లూరే ముద్దు!

- అన్నిటికీ వ్యయ ప్రయాసే!
- ఇప్పుడున్న నెల్లూరు సౌకర్యవంతం
- రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కలువాయి వాసుల వేడుకోలు
- మార్పుపై టీడీపీ నాయకుల ఆగ్రహం
- నేడు సమావేశం

8

మెగా పీటీఎం 3.0 నిర్వహణకు రూ.51.43 లక్షల మంజూరు

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0) నిర్వహణకు రూ.51,43,500 మంజూరైనట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో, డీఈఓ ఆధ్వర్యంలో జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలల బలోపేతానికి సాయం చేసిన దాతలను సన్మానించడం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ మెగా ఈవెంట్ ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని 2,608 పాఠశాలలకు రూ.51,43,500 కేటాయించామని పేర్కొన్నారు. 30 మంది పిల్లలున్న 1510 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.900, 31-100 మంది పిల్లలున్న 663 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.2,250, 101-250 మంది పిల్లలున్న 287 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.4,500, 251-1000 మంది ఉన్న 147 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.6,750, వెయ్యిమందిపైన ఉన్న పాఠశాలకు రూ.9వేల చొప్పున నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

రేపు మెగా పేరెంట్స్‌- టీచర్స్‌ కార్యక్రమం

రాపూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల 5వ తేదీన పేరెంట్స్‌- టీచర్స్‌ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాపూరు మండల పరిషత్‌ అధికారిణి మారెళ్ల భవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మండలాధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎంపిక చేసిన పాఠశాలల్లో హాజరు కావాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తప్పని సరిగా పాల్గొనాలని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12286
వెండి కిలో ధర	రూ. 183000
వెండి ఒక గ్రాము	రూ. 188.00

వైభవంగా కృత్తికా దీపోత్సవం



కృత్తికా దీపోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో బుధవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా కృత్తికా దీపం (అఖండం) వెలిగించారు. భక్తులు అఖండ దీపోత్సవంలో నెయ్యి, నువ్వులనూనె, వేప, విప్ప నూనెలతోపాటు పలు రకాల నూనెలను పోశారు. ఉభయకర్తలు శ్రీ మల్లి కార్జునస్వామికి, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, కామాక్షితాయికి నవావరణ పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ సాంప్రదాయాలతో ముందుగా గర్భాలయంలో అమ్మవారికి హారతి ఇచ్చి ఆ హారతితోనే అర్చకులు అఖండదీపోత్సవం వెలిగించారు. తిరుపతికి చెందిన ధరణీకృష్ణ, శబరీకృష్ణ దంపతులు, ఆలయ చైర్మన్‌ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమద్‌ వ్రత పూజలు



విశేష అలంకరణలో ఆంజనేయ స్వామి

రాపూరు, డిసెంబర్‌ 3 (ఆంధ్రజ్యోతి): హనుమద్‌ వ్రతం సందర్భంగా పెంచలకోన క్షేత్రంలో పాలకుడు సుందర వీరాంజనేయ స్వామికి విశేష అభిషేకాలు, ఆకు పూజ, పూలంగి సేవ తదితర పూజలు నిర్వహిం చారు. విశేష ఆస్థాన పరచి తీరుచ్చి పల్లకి పై మాడ వీధులలో ఊరేగించారు. వేద మంత్రోచ్చరణల మధ్య వైభవంగా సాగిందని ఆలయ ఉప కమీషనర్‌ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. గురువారం ఆలయ హుండీ లెక్కింపు ఉన్నందువల్ల ఆసక్తిగల భక్తులు పంచ, ఉత్తరని ధరించి స్వామి సేవలో పాల్గొనవచ్చని ఆలయ అధికారులు తెలిపారు.

భళా.. అరోనికా ప్రిన్సెస్‌!



అరోనికా ప్రిన్సెస్‌

కోవూరు పట్టణానికి చెందిన అరోనికా ప్రిన్సెస్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ కు చెందిన పెన్కాక్‌ సిలాట్‌లో అద్భుత ప్రతిభ కనబరుస్తోంది. ఇటీవల నెల్లూరు నగరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణపతకాన్ని సాధించిన బాలిక పట్టణానికి చెందిన ముసలి అభిషేక్‌ కుమార్తె. స్వర్ణపతకం సాధించిన ఈ చిన్నారిని, కుటుంబ సభ్యులు, కోచ్‌ ఉలవపాటి జాన్‌ బిన్నీని పలువురు అభినందించారు.

- కోవూరు (ఆంధ్రజ్యోతి)

పంచసూత్రాలపై రైతులకు అవగాహన

మనుబోలు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-1లో రైతులకు బుధవారం వ్యవసాయాధికారులు పంచసూత్రాలపై అవగాహన కల్పించారు. నేనున్నామీకోసం కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకోసం పంచసూత్రాలను తయారుచేసిందన్నారు. ఈ సూత్రాలను పాటిస్తే రైతు రాజు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది రైతులకు మద్దతుధరను కేంద్ర ప్రభుత్వం పెంచిందన్నారు. అనంతరం కరపత్రాలను ప్రదర్శించారు. రైతులు యూరియా, డీఏపీ, ఇతర ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా ఇస్తే మరింత ఉపయోగం ఉంటుందని ఏవోని కోరారు. నీటిసంఘం అధ్యక్షుడు పచ్చిపాల రామిరెడ్డి, రైతు రాష్ట్ర కార్యదర్శి రాయపాటి కిరణ్‌, ప్రకృతి వ్యవసాయం సీఆర్‌పి వరలక్ష్మీ, విఏఏ శివకుమార్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'రైతన్నా..మీకోసం'

రాపూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాలతో మండలం అధ్యక్షులు చెన్ను అశోక్‌ రెడ్డి ఆధ్వర్యంలో రాపూరు మండలం ఏపూరులో రైతన్న మీకోసం గ్రామసభ నిర్వహిం చారు. రాపూరు మండల సొసైటీ అధ్యక్షులు దందోలు వెంకటేశ్వర్‌ రెడ్డి, క్లస్టర్‌ 3 కన్వీనర్‌ ఎన్‌. వెంకట రమణ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మధు రెడ్డి, క్లస్టర్‌ 3 కో-కన్వీనర్‌ చెన్ను పెంచలరెడ్డి పాల్గొన్నారు.

రిలయన్స్‌ రోడ్డు మలుపు.. ప్రమాదాలకు పిలుపు!

ముత్తుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరు రిలయన్స్‌ రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. గత ఆరు నెలల్లో ఈ పరిసర ప్రాంతాలలో నలుగురు మృతి చెందడంతోపాటు ఏడు మంది గాయపడ్డారు. తాజాగా బుధవారం రిలయన్స్‌ రోడ్డు మలుపు నుంచి నెల్లూరుకు వెళ్తున్న బైకును నెల్లూరు నుంచి వచ్చే ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కొండూరు రత్నం అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. రిలయన్స్‌ రోడ్డు సమీపంలో ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోడంతో కనీసం ప్రధాన రహదారిపై వాహనాలు కనిపించే అవకాశం లేక ప్రమాదా లు జరిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదే ప్రాంతంలో పలు యాక్సిడెంట్‌లు జరిగి ప్రాణాలు కోల్పోతున్న ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి జాగ్రత్తలు చేపట్టడంలేదు. ముత్తు కూరు నెల్లూరు రహదారిపై ఈ ప్రమాదకర మలుపు విష యంపై స్థానికులు పలుమార్లు అధికారులు దృష్టికి తీసు కెళ్లిన ఎలాంటి స్పందన లేదు. ప్రజలు ప్రాణాలు కోల్పోతే తప్ప అధికారులు స్పందించరా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు వైపులా ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తే తప్ప ఈ ప్రాంతంలో ప్రమాదాలను నివారించడం సాధ్యం కాదని భావి స్తున్నారు. ఎప్పటికైనా ఆర్‌ అండ్‌ బీ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకొని ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.



ప్రమాదకరంగా రిలయన్స్‌ రోడ్డు మలుపు

వైసీపీ పాలనలో వ్యవస్థలు సర్వనాశనం

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఐదేళ్ల పాలనలో ఇరిగేషన్‌ పనులు చేయకుండానే బిల్లులు చేసుకుని ఇరిగేషన్‌ వ్యవస్థనే సర్వనాశనం చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. మండలంలోని గొలగమూడి, వెంకటాచలం లోతట్టు ప్రాంతాలు, పొ లాలను బుధవారం ఆయన పరిశీలించారు. వెంకటాచలంలో పేదలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. గొలగమూడిలోని కాశీనగరం ఎస్టీ కాలనీలో వరదనీరు చేరిన ఇళ్లతోపాటు నీటమునిగిన పొలాలను పరిశీలించారు. మండలంలో సుమారు 23 సెంటీమీటర్లు భారీ వర్షపాతం నమోదైందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులతోపాటు పేదలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ శ్రీనివాసులు, ఎంపీడీఓ కల్పన, చవటపాళెం సొసైటీ చైర్మన్‌ రావూరి రాధాకృష్ణమనాయుడు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పంటపొలాలను పరిశీలించిన సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మనుబోలు: మండలంలోని మనుబోలు, వెంకన్నపాళెం, కొండూరుసత్రం వద్ద నీటమునిగిన నార్లు, నాట్లు, నారుమడులను బుధవారం సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. దెబ్బతిన్న నార్లను పొలాలోంచి తీసి రైతులు ఆయనకు చూపించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంనుంచి సహాయక చర్యలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ఏఎంసీ చైర్మన్‌ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, నాయకులు మధునాయుడు, వెడిచెర్ల వెంకట రమణా రెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, హనుమంత నాయుడు, శేఖర్‌ నాయుడు, సాని వెంకటర మణయ్య, రాజాగౌడ్‌ పాల్గొన్నారు.

అలాగే వెంకటాచలం, కసుమూరు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, పొలాలను వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. వెంకటాచలంలో భో జన ప్యాకెట్లను పంపిణీ చేశారు. కురిచెర్లపాడులో జన సేన పార్టీ సర్వేపల్లి సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌ నాయుడు, నేతలతో కలిసి పర్యటించారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడి

- రైతులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచన

ఇందుకూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : మారిన పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో వ్యవసాయంలో పండుగ వా తావరణం నెలకొందని ఆ మె పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జగదేవిపేటలో రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్య క్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యాన పంటలు, ఆక్వా సాగును పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి సాగు వివరాలు తెలుసుకున్నారు. చిన్న, సన్నకారు రైతుల కోసమే యూరియా కార్డుల విధానాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని ఆమె రైతులకు సూచించారు. కోవూరు నియోజక వర్గాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్‌ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్‌ రావెళ్ల వీరేంద్రనాయుడు, ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, చెంచు కిషోర్‌ యాదవ్‌, కూకటి వెంకటేశ్వర్లురెడ్డి, బొల్లినేని రవినాయుడు, బొల్లినేని హరి నాయుడు, అవ్వారు ఏడుకొండలు, బీజేపీ, జనసేన నాయకులు, టీడీపీ యూనిట్‌, క్లస్టర్‌ బూత్‌ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.



అరటి గెలను పరిశీలిస్తున్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

విడవలూరు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఈస్ట్రన్‌ చానల్‌ డీసీ చైర్మన్‌ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో విడవలూరులో మంగళవారం జరిగిన రైతన్న మీకోసం వర్క్‌షాప్‌ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తీసుకున్న ముందస్తు చర్యల కారణంగా రబీ సీజన్‌లో రైతులకు పుష్కలంగా సాగునీరు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి లక్ష్మి, మత్స్యశాఖధికారి సురేష్‌, విడవలూరు పీఏసీఎస్‌ చైర్‌పర్సన్‌ పొన్నలూరు పురంధర్‌రెడ్డి, నీటి సంఘాల అధ్యక్షులు బెజవాడ గోవర్ధన్‌ రెడ్డి, నాయకులు సత్యవోలు సత్యంరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సీపీఎం నాయకులు తూళ్లూరు గోపాల్‌, వీఏఏలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ముత్తుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేలటూరు పట్టపుపాలెంలో బుధవారం 13 మంది పేకాట రాయుళ్లను పోలీసులు పట్టుకున్నారు. నేలటూరుపాలెంలోని కోడి ప్రసాద్‌ అనే వ్యక్తికి చెందిన నిర్మాణంలో ఉన్న ఇంటిలో పేకాట నిర్వహిస్తున్న సమాచారంతో కృష్ణపట్నం ఎస్‌ఐ జేపీ శ్రీనివాసులు రెడ్డి, ముత్తుకూరు ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డిలు కలిసి దాడులు నిర్వ హించారు. పేకాట ఆడుతున్న 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 50వేల నగదు, రెండు కార్లు, ఒక బైకు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

తోటపల్లిగూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమి కోన్నత పాఠశాల భవిత సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా అకాడమిక్‌ మానిటరింగ్‌ ఆఫీసర్‌ శ్రీధర్‌బాబు జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్‌ ప్రసాద్‌, మండల విద్యాశాఖ అధికారి వేణుగోపాలరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు రెడ్డి, స్పెషల్‌ టీచర్‌ రామచంద్రయ్య, ఐఈఆర్‌పీలు లావణ్య, షహనాజ్‌ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం: అంగవైకల్యం శరీరానికి మాత్రమే కానీ మనసుల్లో కల్మషం లేని మంచి తనం కలిగి వుంటారని బుచ్చి ప్రభుత్వ వైద్యశాల (హెచ్‌డీసీ) డైరెక్టర్‌ దొడ్ల కోదండ రామిరెడ్డి అన్నారు. భవిత స్కూలులో దివ్యాం గుల నడుమ కేక్‌ కట్‌ చేశారు. కోదండ రామి రెడ్డి, బెజవాడ శ్రీనాథ్‌రెడ్డి స్వీట్లు పంపిణీ చేయించారు. చాపలు పంపిణీ చేశారు. లయన్స్‌ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు.

రాష్ట్రస్థాయిలో శశిరాజు ప్రతిభ అభినందనీయం

రాపూరు, డిసెంబర్‌ 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. కర్నూల్‌లో జరిగిన 69వ ఆంధ్రప్రదేశ్‌ స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌-2025 ఆధ్వర్యంలో జరిగిన అండర్‌-19 విభాగంలో రగ్బీ పోటీలో టి.శశిరాజు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. పొదలకూరు డిఎన్‌ఆర్‌ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్‌-17 రగ్బీ పోటీల్లో ఏ.వాణి రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానం సాధించింది. ఈ సందర్భంగా రాపూరు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌ బి. కృష్ణవేణి అభినందించారు.

మడుగును తలపిస్తున్న తహసీల్దారు కార్యాలయం

పొదలకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తహసీల్దారు కార్యాయంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా వర్షపునీరు చేరింది. కార్యాలయం చుట్టూ వర్షపు నీరు చేరడంతో ఆఫీసు ఆవరణం మడుగు లాగా తయారైంది. తహసీల్దారు కార్యాలయం లోతట్టు ప్రాంతంలో ఉండడం, చుట్టుపక్కల ఇల్లు, వీధులు ఎత్తుగా ఉండడంతో వర్షపు నీరంతా కార్యాలయ ఆవరణంలో చేరి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. 30 ఏళ్ల కిందట కట్టిన కార్యాలయం కావడంతో అక్కడక్కడ కురుస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



తహసీల్దారు కార్యాలయ ఆవరణలో నీటి మడుగు

గోడే లేకుంటే.. గోవిందా!



రోడ్డుపక్కన నేల కుంగడంతో వాలిపోయిన కంటైనర్‌

మనుబోలు, డిసెం బరు 3 (ఆంధ్ర జ్యో తి): ఈ చిత్రం చూశా రా... ఏదైనా సినిమా కోసం కంటైనర్‌ లారీని ఇలా ఫీటు చేశారను కోకండి. వర్షానికి నేల కుంగడంతో ఇలా వాలి పైకి లేచింది. ఇలాం టివి జరగతాయనే ముందుగానే ఊహించి రైల్వే అధికారులు అడ్డుగా కాంక్రీటు బండను కట్టారు. అదే లేకుంటే ఇవాళ కంటై నర్‌ రైల్వేలైనుకు దగ్గరగా పడిఉండేది. ఇంతకీ ఇది ఎక్కడ జరిగిందంటే మండలపరిధిలోని కొండూరు సత్రం జాతీయరహదారి వద్ద బుధవారం చోటు చేసుకుంది. చెన్నై నుంచి కెమికల్‌ లోడుతో హైద్రాబాద్‌ వెళుతున్న లారీని డ్రైవర్‌ ఢాబా వద్ద మధ్యాహ్న సమయంలో బోజనం కోసం నిలిపాడు. బోజ నం చేసి వచ్చేసరికి ఇదిగో ఇలా కంటైనర్‌ పక్కకు వాలి లారీ ఒంటిచక్రాలపై నిలబడింది.

తుఫాన్‌ బాధితులకు నాయకుల చేయూత

ముత్తుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు అండగా నిలుస్తామని సీనియర్‌ నాయకులు కొత్తపల్లి రమేష్‌ తెలిపారు. బ్రహ్మదేవం గ్రామంలో సబ్‌స్టేషన్‌ ఎదురుగా ఉన్న గిరిజన కాలనీలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు భారీ వర్షాలకు ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ఆహారం అందించారు. టీడీపీ నాయకులు ఆలూరు విష్ణువర్ధన్‌రావు, బొబ్బేపల్లి అంకయ్య, దయాకర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి నారా యణ, దాసరి శీనయ్య, లక్ష్మీప్రసాద్‌, శివకుమార్‌, భరద్వాజ, మధుసూదన రావు, బద్రి, వెంకటరమణ్య, తదితరులు పాల్గొన్నారు.

- అదానీ కృష్ణపట్నం పోర్టు యాజమాన్యం తుఫాను కారణంగా ఇబ్బందిపడుతున్న గిరిజనులకు బుధవారం ఆహారం పంపిణీ చేశారు. కృష్ణపట్నం చలివేంద, ముత్తుకూరు గిరిజన కాలనీల్లో మందికి పోర్టు సీఈవో జగదీస్‌ పటేల్‌ ఆదేశాల మేరకు ఆహారాన్ని అందించారు. ప్రకృతి వైపరీత్యాల్లో ప్రజలను ఆదుకునేందుకు అదానీ కృష్ణపట్నం పోర్టు ముందుంటుందని పోర్టు ప్రతినిధులు తెలిపారు.
- పైనంపురంలోని ఎస్‌ఈఐఎల్‌ ఎనర్జీ ఇండియా లిమిటెడ్‌ కంపెనీ తహసీల్దారు స్వప్న వినతి మేరకు పైనంపురం పంచాయతీలోని తుపాను పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు ఆహారాన్ని పంపిణీ చేశారు.



ఆహారం పంపిణీ చేస్తున్న ఎస్‌ఈఐఎల్‌ ప్రతినిధులు

మనుబోలు: ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని పిడూరుపాళెం టీడీపీ యువనాయకులు పలగాని బాబుల్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి, గాలి రాజేష్‌రెడ్డిలు బుధవారం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వర్షాలతో పాటు చలిగాలులు వీస్తుండడంతో గిరిజనుల క్షేమం కోరి, ఎమ్మెల్యే సూచనలతో అందిస్తున్నట్లు దాతలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజనులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

పొదలకూరు : పట్టణంలోని శివాలయం దగ్గర చెరువు కట్ట కింద ఉంటున్నటువంటి గిరిజనులు బుధవారం దిత్వా తుఫాను కారణంగా తమ ఇంటి ముందు వరద ప్రవాహం ఎక్కువగా ప్రవహిస్తుండడంతో గిరిజన కుటుంబాలు ఆ వరదల్లో చిక్కుకున్నారు. ఇది గమనించిన స్థానికులు టీడీపీ యువ నాయకులు ఆదాల మురళీకి తెలుపడంతో పొదలకూరు ఫైర్‌ సిబ్బంది వారిని ట్యూబ్‌ సహాయంతో వాళ్లని సేఫ్‌ పాయింట్‌కి చేర్చారు. వీరికి ఆహారం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో మస్తాన్‌, ఫైర్‌ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన తుఫాన్‌ ముప్పు!

ముత్తుకూరు : మండలంలోని తీర గ్రామాలకు దిత్వా తుఫాను ముప్పు తప్పింది. బుధవారం కొద్దిపాటి వర్షం కురిసింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలతో కృష్ణపట్నం చలివేంద్ర ముత్తుకూరు గిరిజన కాలనీలలో ఇళ్ల చుట్టూ నీళ్లు చేరాయి. దీంతో గిరిజనులను సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. తహసీల్దారు స్వప్న ఆధ్వర్యంలో మండల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో పరిస్థితిని సమీక్షించారు. కాలనీలలో ఇళ్ల చుట్టూ నీరు చేరడం తప్ప తుఫాను వల్ల పెద్దగా నష్టం వాటిల్లలేదు.

C.R.I.M.E N.E.W.S

అత్తింటి వేధింపులు తాళలేక
ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



షేక్‌ కుబ్రా(ఫైల్‌)

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘ టన బుధవారం మండలం లోని నందిపాడు గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తె లిపిన వివరాల మేరకు.. నంది పాడు గ్రామానికి చెందిన షేక్‌ మహ్మద్‌రఫీ మర్రిపాడు మండలం పెగళ్లపాడు మసీదులో ఇమామ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఉదయగిరి పట్టణం దేవలాలగడ్డకు చెందిన షేక్‌ కుబ్రా(18)తో ఈ ఏడాది ఆగస్టు మాసంలో వివాహమైంది. వివాహం అయినప్పటి నుంచి అత్త, భర్త వేధింపులు అధికమయ్యాయి. ఈతరుణంలో ఇటీవల కుబ్రా వైద్యశాలకు వెళ్లడంతో అక్కడి వైద్యులు గర్భందాల్చినట్లు తెలిపారు. ఆనందంలో ఉన్న కుబ్రా తన పుట్టింటికి వెళ్లి వస్తానని కోరగా అందుకు వారు ససేమిరా అన్నారు. దీంతో మనస్తాపానికి గురైన కుబ్రా తన అత్త రసూల్‌బీ పని నిమిత్తం బయటకు వెళ్లడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన అత్త ఉరి వేసుకుని వేలాడుతున్న కోడలిని చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉదయగిరి సీఐ వెంకటరావు, తహసీల్దారు యమనల నాగరాజు, ఎస్‌ఐ ఆదిలక్ష్మీలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి పెద్దమ్మ గౌసియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ట్యాంకర్‌ డ్రైవర్‌ దుర్మరణం

- పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ
- మృతుడు కృష్ణాజిల్లా వాసి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని జాతీయ రహదారిపై వీపీఆర్‌ విల్లాల వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సౌత్‌ ట్రాఫిక్‌ పోలీసుల సమాచారం మేరకు... కృష్ణా జిల్లా చెర్లపల్లి ప్రాంతానికి చెందిన వీ సాంబశివరావు(64) పాల ట్యాంకర్‌ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. బుధవారం పాల ట్యాంకర్‌తో విజయవాడ నుంచి చెన్నైకు వెళ్తుండగా వీపీఆర్‌ విల్లా వద్ద వాహనం ఆగిపోయింది. దీంతో డ్రైవర్‌ సాంబశివరావు వాహనం దిగి పరిశీలిస్తుండగా వెనుక నుంచి ధాన్యం లోడుతో వేగంగా వస్తున్న లారీ ఆయనను ఢీకొని రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సౌత్‌ ట్రాఫిక్‌ పోలీసు స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పరిశీలిం చారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల దొంగ అరెస్ట్‌

- 10 బైకులు, రెండు ఆటోల స్వాధీనం



నిందితుడి వివరాలు తెలియచేస్తున్న ఇన్‌స్పెక్టర్‌ కోటేశ్వరరావు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుసగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఘరానా దొంగను నెల్లూరులోని చిన్న బజారు పోలీసులు అరెస్ట్‌ చేశారు. నిందితుడి వివరాలను బుధవారం ఆ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌ చిట్టెం కోటేశ్వరరావు విలేకర్లకు వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 22న మనుబోలు మండలం కాగితాలపూరుకు చెందిన మీర్జా జుల్ఫీకర్‌ ఆలీ ఆటోలో నెల్లూరుకురాగా నగరంలో ఆ వాహనం మాయమైంది. అతని ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆదారంగా నిందితుడు నెల్లూరు రూరల్‌ మండలం ఎలమవారి దిన్నె ప్రాంతానికి చెందిన పనికి కల్యాణ్‌కుమార్‌గా గుర్తించారు. ఆటోతో నిందితుడు పరారవుతుండగా బుధవారం అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా రెండు ఆటోలు, పది బైక్‌లు దొంగలించినట్లు అంగీకరించాడు. దీంతో రూ.5.20 లక్షల విలువచేసే ఆ 12 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని అరెస్ట్‌ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్‌ రజాక్‌, క్రైమ్‌ పార్టీ సిబ్బంది సురేష్‌బాబు, ఎస్‌వీ శ్యామ్‌ ప్రసాద్‌, ఎం సుబ్బారావు, సీహెచ్‌కే వర్ధన్‌, ఎస్‌కే రి యాజుద్దీన్‌, కే దేవనాయుడు, ఎన్‌ దయాశంకర్‌, కే విజయ కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారని ఇన్‌స్పెక్టర్‌ తెలిపారు.

ఉద్యోగం పేరిట రూ.లక్షలు దోచేశాడు!

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షలు దోచేసిన వ్యక్తిపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట ప్రాంతం మాగుంటనగర్‌కు చెందిన కామాక్షి మంచాలు అల్లుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఏడేళ్ల క్రితం కడప జిల్లాకు చెందిన నారుబోయిన రాజశేఖర్‌ పరిచయం అయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను నమ్మించి 2021లో రూ.5లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో కామాక్షి గట్టిగా నిలదీసింది. దీంతో రూ.1లక్ష నగదు వెనుకకు ఇచ్చాడు. అయితే ఆమె తనకు నగదు అవసరం ఉందని చెప్పడంతో వారి వద్ద బంగారు నగలు తీసుకొని ముత్తూట్‌ ఫైనాన్స్‌లో గోల్డ్‌ లోన్‌ తన పేరుపై పెట్టి నగదు ఇప్పించాడు. అయితే ఆ లోన్‌లో కామాక్షికి చెప్పకుండా నగదు తీసుకున్నాడని ఫైనాన్స్‌ వారు చెప్పడంతో ఆమె బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం కోసం గాలింపు

ఉదయగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయంలో ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రం గోరఖ్‌పూర్‌ జిల్లా సగన్వ గ్రామానికి చెందిన సౌరబ్‌కుమార్‌ మంగళవారం గల్లంతైన విషయం విధితమే. అయితే యువకుడి మృతదేహం కోసం ఎస్‌ఐ అల శ్రీను అగ్నిమాపక సిబ్బంది, మత్స్యకారుల సహకారంతో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. పడవ సహాయంతో జలాశయం నీటిలో గాలాలు వేసి గాలింపు చేపడుతున్నా మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఉదయగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీప అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో దాడిచేసి పరారీలో ఉన్న బొబ్బా ఆదినారాయణను బుధవారం ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. గతనెల 29న అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లిన వరసకు వదినైన లక్ష్మీనరసమ్మ, మరదలైన కవితలపై బొబ్బా ఆదినారాయణ గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి పరారైన సంఘటన విధితమే. అయితే నాటి నుంచి ఎస్‌ఐ తన సిబ్బందితో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈతరుణంలో బుధవారం కాలనీ సమీపంలో గాలింపు చేస్తుండగా అటవీ ప్రాంతం నుంచి కాలనీలోకి వస్తున్న ఆదినారాయణను తన సిబ్బందితో చాకచక్యంగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 670



పెనుబర్తిలో 'రైతన్నా మీకోసం'

నెల్లూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పెనుబర్తిలో నిర్వహించారు. ప్రభుత్వం, శాస్త్రవేత్తలు సూచించే సలహాలు, సూచనలు పాటిస్తే వ్యవసాయంలో మంచి ఫలితాలను పొందుతారని వక్తలు రైతులకు సూచించారు. ఈ మేరకు రూపొందించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు గోదాములు, ఆరబెట్టుకునేందుకు డ్రయర్స్ కావాలని ఈ సందర్భంగా రైతులు కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వినీత, శివజ్యోతి, టీడీపీ నేత గిరిధర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు శ్రీదేవి, నాగమోహన్ పాల్గొన్నారు.



నగరంలోని అయ్యప్పగుడి సమీపంలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు, భారీగా నీళ్లు చేరడంతో నిలిచిపోయిన వాహనాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న ములుముడి కలుజు, దానిపైనే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

వర్ష బీభత్సం

- పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద ఉధృతంగా ప్రవాహం
- నీట మునిగిన పంట పొలాలు, గల్లంతైన నారుమళ్లు
- మగ్గం గుంతల్లోకి నీళ్లు ● ఆగిన చేనేత, వ్యవసాయ పనులు

నెల్లూరు రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు నెల్లూరు రూరల్లో బీభత్సం సృష్టించాయి. బుధవారం వేనుకజామున భారీ వర్షంపడటంతో పంట పొలాలన్నీ నీట మునిగాయి. వరి నారుమళ్లు గల్లంతయ్యాయి. పొట్టే పాళెం, ములుముడి కలుజుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహన రాకపోకలను కొన్ని గంటలపాటు నిలిపేశారు. మండలంలోని సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణ రెడ్డిపేట గ్రామాల్లో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. దీంతో చేనేత పనులకు ఆటంకం ఏర్పడింది. అదేవిధంగా వర్షం కారణంగా వ్యవసాయ పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. పల్లెల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునగడంతో ఆయా ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇక, కనుపూరు కాలువ వర్షాలు, వరదలతో సామర్థ్యానికి మించి పారుతోంది. అక్కడక్కడ రెగ్యులేటర్ చెక్కలు బలహీనంగా ఉండటంతో స్థానిక రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు అవస్థపడ్డారు. మండలంలోని కాకుపల్లి వద్ద ముంపు వాసులకు కేఆర్ చారిటబుల్ ట్రస్టు, విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్యాణ్‌రెడ్డి, రాములు ఆహారం అందచేశారు. ఆటోల్లో ఇళ్ల వద్దకు వెళ్లి ఆహారం పంపిణీ చేశారు.



బుజబుజ నెల్లూరులో నీట మునిగిన కాలనీ

బుజబుజ నెల్లూరు జలమయం !

- కాలనీలన్నీ మునక ● ఏటా ఇంతే! ● స్థానికుల ఆందోళన

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వాయుగుండ ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు నగర శివార్లలోని బుజబుజ నెల్లూరు ప్రాంతం నీట మునిగింది. పరిసరాల్లోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. పక్కనే జాతీయ రహదారి ఉండటం, మరోవైపు రహదారి పునర్నిర్మాణ పనులు జరుగుతుండటంతో వర్షపు నీరు పోయేందుకు దారి లేక నీళ్ల ఇళ్లలోకి చేరాయి. రాకపోకలు స్తంభించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇక్కడి ప్రధాన రహదారుల్లో డ్రైనేజీ రోడ్లపైనే పారుతోంది. నివాస ప్రాంతాల నడుమ డ్రైనేజీ దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తల్పగిరి కాలనీ ప్రజలు నీటమునిగిన రోడ్డుపైనే కూర్చొని అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

సంవత్సరాలుగా తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని, చినుకు పడితే భయంభయంగా జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏళ్లుగా నిర్లక్ష్యం

ఎక్కడ చూసినా చెత్తాచెదారమే...కొన్నిచోట్ల మురుగు కాలవలు ఉండవు, అవి ఉన్నచోట నీరు పారదు. వెరసి చెత్తకుప్పలు, మురికి కూపాలకు నిదర్శనమే బుజబుజనెల్లూరు. 10వేలమందికి పైగా ప్రజలు నివాసం ఉండే ఈ ప్రాంతంలో తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివాజీ నగర్, వికలాంగుల కాలనీ, వల్లూరమ్మ కాలనీ, గొల్లపాళెం, రామ్‌నగర్ వీధి, అంబేడ్కర్ కాలనీ, భగత్‌సింగ్ కాలనీ తదితర కాలనీలు ఉన్నాయి. పల్లపు ప్రాంతం కావడంతో చినుకుపడితే ఈ కాలనీలన్నీ జలమయమవుతున్నాయి. దీంతో స్థానిక ప్రజలు పడే బాధలు వర్ణనాతీతం. సంవత్సరాల తరబడి ఈ సమస్యలతో వారు సహవాసం చేస్తున్నా శాశ్వత పరిష్కారానికి మాత్రం అటు పాలకులుగానీ, ఇటు అధికారులు గానీ గట్టి చర్యలు చేపట్టిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.



ఆర్టీసీ కాలనీని ముంచెత్తిన వర్షపు నీరు



కాలనీ ప్రధాన రహదారి నీట మునగడంతో నిలిచిపోయిన రాకపోకలు



పేదలకు ఆహారం అందచేస్తున్న కళ్యాణ్‌రెడ్డి



పట్టరపట్టు... : వర్షపు నీటిలో నిలిచిపోయిన కారును తోస్తున్న యువకులు



తాటిపర్తి రోడ్డు పక్కన నీట మునిగిన పంట పొలాలు



రోడ్డుపైనే నిరసన వ్యక్తం చేస్తున్న తల్పగిరి కాలనీ వాసులు



పప్పులవీధి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సామూహికంగా హనుమద్వ్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రామ మందిరాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో బుధవారం హనుమద్వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ఆకు పూజలు, పల్లకీ ఉత్సవాలు జరిగాయి. నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఉదయం హనుమద్వ్రతం, లక్ష తమలపాకులతో సామూహిక పూజ, హోమాలు, అన్నప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం శ్రీరామ కోటి పుస్తకాలకు విశేష పూజలు నిర్వహించి ఊరేగింపుగా తీసుకెళ్లి శ్రీరామస్తూపంలో నిక్షిప్తం చేశారు. అర్చకుడు నరేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఆలయ చైర్మన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మహాత్మా గాంధీ నగర్ కృష్ణమందిరంలో హనుమ వ్రతం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా సీతాలక్ష్మణ హనుమ పరివార శ్రీరామ చంద్రమూర్తికి విశేష అలంకారం, ఆకుపూజలు జరిగాయి. అలాగే సంతపేట ఆంజనేయస్వామి ఆలయం, పప్పులవీధి ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ హనుమద్వ్రతాన్ని భక్తితో నిర్వహించారు.

'గంజాయి వద్దు బ్రో' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : గంజాయి వినియోగానికి వ్యతిరేకంగా గంజాయి వద్దు బ్రో పేరిట రూపొందించిన పోస్టర్లను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం నగరంలోని ఆమె నివాసంలో ఆవిష్కరించారు. గంజాయిని అరికట్టడం లో ప్రతీ ఒక్కరూ భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. డ్రగ్స్ రహిత కోవూరే లక్ష్యమని చెప్పారు. గంజాయికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియచేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, వేమారెడ్డి బాలకృష్ణారెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర రావు 104వ జయంతిని శ్రీవాణి సంగీత స్వర ఝరి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 6గంటలకు నెల్లూరు వర్ధమాన సమాజంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఫణతుల కృష్ణయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఘంటసాల అభిమానులందరూ తరలిరావాలని కోరారు. కాగా, గురువారం ఘంటసాల జయంతి వేడుకలు జరుపుతున్నట్లు నిర్వాహకులు నీలకంఠం శ్రీనివాసులురెడ్డి, టీ సుధాకర్, పద్మశ్రీ ఘంటసాల కళానికేతన్ వ్యవస్థాపకుడు ఆనందరావు తెలిపారు. వారు బుధవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉదయం ఘంటసాల విగ్రహానికి నివాళులు, సాయంత్రం టౌనుహాలులో జయంతి సభ, పాట కచేరీ నిర్వహిస్తున్నామని, అభిమానులు అందరూ తరలిరావాలని కోరారు.

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

- స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అమోఘమని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ అన్నారు. నగరంలో రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టులను బుధవారం ఆమె సందర్శించారు. రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రాన్ని చూసి అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో సరదాగా గడిపారు. తలసీమియా విభాగాన్ని పరిశీలించి అక్కడ రక్తమార్పిడి జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. రక్తనిధిని కూడా సందర్శించారు. రెడ్‌క్రాస్‌కు అన్నీ విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ చామర్తి జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్ వద్ద ఫ్లైఓవర్ మంజూరు చేయండి

- హైవేస్ చైర్మన్‌కు వేమిరెడ్డి వినతి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి-16పై నగరంలోని ఎన్టీఆర్ నగర్ వద్ద ఫ్లైఓవర్ వంతెన మంజూరు చేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో చైర్మన్‌ను కలిసి విన్నవించారు. ఎన్టీఆర్ నగర్ వద్ద ఎన్‌హెచ్-16పై వాహనాలు, పాదచారుల రాకపోకలు ఎక్కువ య్యాయని ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలి పారు. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్ నగర్ జంక్షన్ వద్ద వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి చైర్మన్ సానుకూలంగా స్పందించారని ఎంపీ పేర్కొన్నారు.

జాతీయ సముద్ర మత్స్య గణనను వివరించండి

- రాజ్యసభలో ప్రశ్నించిన ఎంపీ బీద

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : జాతీయ సముద్ర మత్స్య గణన-2025 గురించి వివరించాలని బుధవారం రాజ్యసభలో ఎంపీ బీద మస్తాన్ రావు ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సమాధాన మిస్తూ గత గణనలతో పోలిస్తే ఎంఎఫ్‌సీ-2025 ఎంతో విస్తృత పరిధి కలిగిందన్నారు. పూర్తిగా డిజిటల్ విధానంతో నిర్వహిస్తారన్నారు. దీని వలన మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందు తాయని తెలిపారు.

ఎమ్మెల్సీ బీదను కలిసిన జడ్పీ సీఈవో

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో శ్రీధర్‌రెడ్డి బుధవారం ఎమ్మెల్సీ బీద రవిచంద్రను కలిశారు. డీపీవోగా ఉన్న శ్రీధర్‌రెడ్డి ఇటీవల జడ్పీ సీఈవోగా నియమితులైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నగరంలోని బీద కార్యాలయానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో బ్లడ్ గ్రూపింగ్ శిబిరం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ సహకారంతో బుధవారం బ్లడ్ గ్రూపింగ్ శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రమణారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థినులకు ఆరోగ్యభద్రత కల్పిస్తున్నామన్నారు. రక్తపరీక్షలు చేయించుకుంటే సమస్యలేమైనా ఉన్నా, గ్రూపింగ్ అవసరము న్నా వారికి అవగాహన కలుగుతుందన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం 350 మంది విద్యార్థినులు గ్రూపింగ్ పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటివేటర్స్ అజయ్‌బాబు, సాయిరామ్, భాస్కర్‌రావు, లాబ్ టెక్నీషియన్ సంతోష్‌బాబు, సిబ్బంది కృష్ణవేణి, శ్రీదేవి, సౌమ్య పాల్గొన్నారు.

విద్యుత్ తెలుగునాడు రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తెలుగునాడు యూనియన్ రాష్ట్ర కార్యవర్గం విజయవాడలో బుధవారం ఏర్పడింది. యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జిల్లాలో పనిచేస్తున్న ఎం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర అధ్యక్షుడిగా సాంబశివరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర, కోశాధికారిగా ఎన్‌ఏవీ ప్రసాద్ ఎన్నికయ్యారు.

భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయ కులపేట ఉర్దూ పాఠశాలలో ఉన్న అర్బన్ భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో తిరుపాల్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందించి వారి ఉన్నతికి పాటుపడాలన్నారు. వారి సామర్థ్యాలను బట్టి ఆయా విభాగాల్లో శిక్షణ అందిస్తే ప్రభుత్వం వారికి ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపకరణాలు, రవాణా భత్యాలను అందరికీ అందించాలని, అవి అందని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువస్తే అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీ మంజుల, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆయాలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లూరు (వైద్యం): దివ్యాంగులు అన్ని రంగాలలో రాణించేలా కృషి చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 47వ డివిజన్‌లో దివ్యాంగులను టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ గణేష్ కుమార్‌తో కలిసి సన్మానించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుంట భాస్కర్, మునిశేఖర్, ఫిరోజ్, అలేఖ్య, బెల్లంకొండ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్ట్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకారవేతనాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ వై నాగదేవీప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 98851 99663, 94401 64423, 98664 46321, నెంబర్లను వాట్సప్ ద్వారా సంప్రదించాలని కోరారు.

కేంద్రీయ విద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరులోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయలో డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఏడురోజుల ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. దీనిని బుధవారం విద్యాలయ ప్రిన్సిపాల్ కేఎస్ శంకరయ్య ప్రారంభించి మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన స్వచ్ఛ భారత్‌ను అందరూ పాటించేలా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నార న్నారు. దీనిలో భాగంగానే తమ పాఠశాలలో కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ నిర్వహించే పరిశుభ్రత, మొక్కలు నాటడం, ఆరోగ్య శిబిరం, గ్రామాభివృద్ధి, అవగాహన ర్యాలీ, సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, కేంద్రీయ విద్యాలయ అధ్యాపకురాలు ఈవా, వలంటీర్లు పాల్గొన్నారు.

'వాత్సల్య'కు రూ.65వేల విరాళం



విరాళం చెక్కు అందచేస్తున్న రెహమాన్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మినర్వా డెవలపర్స్ సంస్థ ఎండీ, నగరంలోని మూలాపేటకు చెందిన అబ్దుల్ రెహమాన్ బుధవారం తన తల్లి ప్యారిజాన్ స్మృత్యర్థం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి రూ. 65వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు చెక్కును వాత్సల్య సంస్థ కార్యదర్శి జీవీ సాంబశివరావుకు బుధవారం అందజేశారు. శరణాలయంలోని పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని ఆకాంక్షించారు.



శ్రీ తారామపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు బుధవారం సాయంత్రం శబరిమలకు తరలివెళ్లారు. బుధవారం వేకువజాము నుంచి స్థానిక బాలా త్రిపుర సుందరి యోగానంద ఆశ్రమం వద్ద నవగ్రహ పూజ గణపతి హోమాలు చేపట్టి ఇరుముడులు ధరించారు. అనంతరం మేళతాళాల నడుమ అయ్యప్ప భక్తుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ర్యాలీగా బయలుదేరి స్థానిక బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకొని కొద్దిసేపు ఎరిమేలి తొక్కారు. అక్కడి నుంచి ఎల్వీఆర్ కళాశాల వద్దకు చేరుకొని ముందుగా ఏర్పాటు చేసుకున్న రెండు ప్రైవేటు బస్సుల్లో శబరిమలకు తరలి వెళ్లారు.

- సీతారామపురం (ఆంధ్రజ్యోతి)

జిల్లా మార్పుపై టీడీపీ నాయకుల ఆగ్రహం

కలువాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలోకి మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయంపై టీడీపీ మండల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలువాయిలోని పాండురంగస్వామి ఆలయంలో పలు గ్రామాల నుంచి వచ్చిన నాయకులు సమావేశమయ్యారు. నెల్లూరు జిల్లాలోనే కలువాయి కొనసాగించేందుకు చేపట్టాల్సిన ఆందోళనలపై టీడీపీ మండల అధ్యక్షుడు చల్లా రఘురామిరెడ్డి అధ్యక్షతన గురువారం జరిగే సమావేశంలో చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టతకు శ్రీకారం

● నేడు డీఎల్‌డీవో కార్యాలయాల ప్రారంభం





ఆత్మకూరులో ప్రారంభానికి ముస్తాబైన డీఎల్‌డీవో కార్యాలయం, ఆకర్షణీయంగా డీఎల్‌డీవో చాంబర్

ఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టత పరిచేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా డివిజనల్ అభివృద్ధి అధికారుల(డీఎల్‌డీవో) కార్యాలయాలను గురువారం ప్రారంభించనున్నారు. ముందుగా డీసీఎం పవన్‌కళ్యాణ్ చిత్తూరు జిల్లాలో ప్రారంభించాక వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని 77 డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభించనున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఆత్మకూరు, కావలి, నెల్లూరు, గూడూరు, సూళ్లూరుపేట డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. డీసీఎం పవన్‌కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖలో మార్పులు చేస్తామని ప్రకటించి డీఎల్‌డీవో కార్యాలయాల ఏర్పాటుతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారు. ఇకపై రెవెన్యూశాఖలో డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు మాదిరిగా డీఎల్‌డీవోలు కూడాఅభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. ఉపాధి పథకం ఏపీడీ, డీఎల్‌పీవోలు కూడా డీఎల్‌డీవో పరిధిలో పని చేస్తారు. ప్రతి డీఎల్‌డీవో కార్యాలయంలో 15 మంది సిబ్బందిని కేటాయించారు. దాంతో డీఎల్‌డీవోలు సంపూర్ణ అధికారాలు, పర్యవేక్షణ అజమాయిషీ కలిగి ఉంటారు. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి.

● డివిజన్‌లో మరింత పటిష్టం

ఇప్పటి వరకు పంచాయతీరాజ్ శాఖకు డివిజన్ స్థాయి అధికారులు లేరు. మండల పరిషత్ కార్యాలయాలపై పర్యవేక్షణకు జడ్పీ సీఈవో, డీఎల్‌పీవోలు ఉన్నప్పటికి గ్రామ పంచాయతీలను డీపీవో పర్యవేక్షించేవారు. దీంతో డివిజన్ స్థాయిలో పట్టులేకపోవడంతో ఉద్యోగుల్లో జవాబుదారీతనం లోపించేది. పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రభుత్వం నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టడంతో మరింత బలోపేతం కానున్నది. డీఎల్‌డీవోలు తనిఖీలు నిర్వహించి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించేలా చూస్తారు.


కార్యాలయ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

ఆత్మకూరులో డీఎల్‌డీవో కార్యాలయం ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. డీఎల్‌డీవో వ్యవస్థతో పంచాయతీరాజ్‌శాఖ బలోపేతం కానున్నది.

-రమణయ్య, డీఎల్‌డీవో, ఆత్మకూరు

రాష్ట్ర కౌశల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కౌశల్-2025 ప్రతిభాన్వేషణ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని జిల్లా కోఆర్డినేటర్ కే భక్తవత్సల నాయుడు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల్లో 8వతరగతి విభాగంలో బ్రాహ్మణక్రాక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జాన్‌వెస్లీ, తరుణవాయి ఉన్నత పాఠశాల నుంచి ప్రవినాష్, బ్రహ్మదేవం ఉన్నత పాఠశాల నుంచి నీహారిక, నెల్లూరులోని కేఎన్‌ఆర్ మునిసిపల్ పాఠశాల నుంచి జ్యోత్స్నవి ఎంపికయ్యారన్నారు. అలాగే 9వతరగతి విభాగంలో బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాల నుంచి మన్విత, ధరిత్రీ, మనుబోలు ఉన్నత పాఠశాల నుంచి శ్రీకావ్య, బ్రహ్మదేవం పాఠశాల నుంచి శ్రీచందన్ వవన్, 10వతరగతి విభాగంలో బ్రాహ్మణక్రాక పాఠశాల నుంచి రేవంత్‌కుమార్, వింజమూరు ఉన్నత పాఠశాల నుంచి గురువిష్ణుష్, వీరేంద్రరెడ్డి, అమ్మవారిపాళెం ఉన్నత పాఠశాల నుంచి నవదీప్ ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈనెల 27వతేదీన జరిగే ప్రతిభాన్వేషణ రాష్ట్రస్థాయి పోటీల్లో వారు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు



కలువాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడో 140 కి.మీ దూరంలో ఉన్న తిరుపతి మాకెందుకయ్యా. 70 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరులోనే ఉంటాం' అంటూ కలువాయి వాసులు తేల్చి చెబుతున్నారు. జిల్లాలు, డివిజన్ల పునర్విభజనలో భాగంగా కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్, తిరుపతి జిల్లా పరిధిలోనికి తీసుకెళుతూ మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సు చేసింది. దీనిపై స్థానికంగా అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే యువత ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. కలువాయిని 42 కి.మీ దూరంలో ఉన్న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్, 70 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరు నుంచి మార్చి 80 కి.మీ దూరంలో ఉన్న గూడూరు డివిజన్‌కు, 140 కి.మీటర్లలోని తిరుపతి జిల్లాకు మారిస్తే అన్నీ ఇబ్బందులేనని ప్రజలు భగ్గుమంటున్నారు. దూరాభారంతోపాటు సాగునీటి సమస్యలు, ఉద్యోగులు, వ్యాపారులకు కూడా పలు సమస్యలు ఉంటాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామన్య ప్రజలు ఉన్నతాధికారులను కలిసి తమ సమస్యలను చెప్పుకోవాలన్నా జిల్లా కేంద్రానికి వెళ్లి తిరిగి రాత్రికి ఇంటికి చేరే పరిస్థితి లేదని వాపోతున్నారు. కలువాయి నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం కూడా అన్ని వేళలా అందుబాటులో లేవని వాపోయారు. రాజకీయ పార్టీలు, ఉద్యోగులతో కలుపుకుని ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

తిరుపతి వద్దు.. నెల్లూరే ముద్దు!

● రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కలువాయి వాసుల వేడుకోలు

సాగునీటి సమస్యలు వస్తాయ్!



కలువాయి తిరుపతి జిల్లా పరిధిలోకి వెళితే కొత్త సమస్యలు వస్తాయి. ముఖ్యంగా రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయి. సోమశిల జలాశయం నెల్లూరు జిల్లా పరిధిలో ఉంటే దాని పరిధిలోని సోమశిల దక్షిణ కింద కలువాయి మండలంలో వేలాది ఎకరాల భూములు తిరుపతి జిల్లాలో ఉంటాయి. దీంతో నెల్లూరు జిల్లా పరిధిలో జరిగే సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశంలో ఇక్కడ రైతుల సాగునీటి అవసరాలను మేరకు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదు. ఇవన్నీ ప్రభుత్వం ఆలోచించాలి. కలువాయిని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి.

- పీర్ల సోమయ్య యాదవ్, రైతు, దాచూరు

వ్యాపారులకూ కష్టాలే!



కలువాయిని తిరుపతిలో కలిపితే చిన్న వ్యాపారులకు ఇబ్బందులు వస్తాయి. వాణిజ్య పన్నులు, అమ్మకం పన్నులు, కార్మిక శాఖ అధికారులను కలసేందుకు నెల్లూరు సౌకర్యంగా ఉంటుంది. అలాంటిది 140 కి.మీ దూరంలో ఉండే తిరుపతికి వెళ్లి రావాలంటే అవస్థలు పడాలి. నెల్లూరు అయితే సరుకుల కొనుగోలుతోపాటు ఆఫీసుల్లో పనులు కూడా చేసుకోవచ్చు.

- పువ్వాడి మల్లిఖార్జున, వ్యాపారి, కలువాయి

ఉద్యోగులకు ఇబ్బందే!



వివిధ పనులపై జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఉద్యోగులకు కూడా ఇబ్బందిగా ఉంటుంది. కలువాయి నుంచి ఉదయం బయలుదేరితే తిరుపతికి వెళ్లేసరికి మధ్యాహ్నం అవుతుంది. వెళ్లిన రోజు పనులు కావు. దీంతో అక్కడే ఉండాలి. తిరుపతి ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో అక్కడ ఉండేందుకు హోటళ్ల అద్దెలు ఎక్కువగా ఉంటాయి. ఇది కూడా భారమే! కలువాయి ఉద్యోగులకు నెల్లూరు జిల్లానే సౌకర్యంగా ఉంటుంది.

- వజ్రాల శ్రీనివాసులు, విశ్రాంత ఉద్యోగి

టీచర్లకు కష్టమే!



తిరుపతి జిల్లాకు కలువాయి మండలం చివర అవుతుంది. ఇక్కడ నుంచి జిల్లా కేంద్రంలో జరిగే శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నా దూరాభారం. ప్రతి ఏటా జిల్లా కేంద్రంలో జరిగే సైన్స్‌ఫెయిర్‌కు విద్యార్థులకు తీసుకుపోవాలన్నా చాలా ఇబ్బంది. పరీక్ష పేపర్ల మూల్యాంకనం చేసేందుకు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలి.

- జీవీ.మురళీకృష్ణ, టీచర్, కలువాయి

రెవెన్యూ డివిజన్ కూడా దూరమే



గూడూరు రెవెన్యూ డివిజన్ కూడా కలువాయికి 80 కి.మీ దూరం ఉంది. ఇది కూడా సామాన్య ప్రజలకు అసౌకర్యంగా ఉంటుంది. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు నెలకు రెండు సార్లు జిల్లా కేంద్రంలో శిక్షణా తరుగతులు నిర్వహిస్తుంటారు. వాటికి హాజరు కావాలంటే ఆర్థిక భారం కూడా పడుతుంది. కాంట్రాక్టు ఉద్యోగులు అవస్థలు పడాలి.

- నాగేశ్వరావు, కాంట్రాక్టు ఉద్యోగి

ఉన్నతాధికారులను కలవాలన్నా కష్టం



ప్రతి సోమవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో జరిగే గ్రీవెన్స్‌లో ఉన్నతాధికారులను కలిసి సమస్యలపై దరఖాస్తులు ఇచ్చేందుకు చాలా మంది పేద ప్రజలు వెళుత్తుంటారు. అలాంటి వారు తిరుపతికి వెళ్లి రావాలంటే రవాణా ఖర్చులు కూడా భరించలేరు. తమ సమస్యను కూడా పేదలు అధికారులకు చెప్పుకునే పరిస్థితి ఉండదు. ప్రతి వారం కనీసం 20 నుంచి 30 మంది జిల్లా కేంద్రానికి వెళ్లి సమస్యలు తెలుపుకుని వస్తుంటారు. వారందరికీ కష్టంగా ఉంటుంది.

- బొమ్ము మహేష్‌రెడ్డి, కలువాయి

అ(వ్వ)మానుషం !

● పాడుబడ్డ ఇంట్లో దీనంగా.. ఒంటరిగా!

● ఏడాదిగా వృద్ధురాలి గృహ నిర్బంధం

● మతిస్థిమితం లే(ద)ని పట్టించుకోని కుటుంబసభ్యులు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 'అన్నార్థులు.. అనాథలుండని ఆ నవ యుగమదెంత దూరం.. కడుపు తీపితో అల్లాడిన కన్నులలో విషాదమెంతో..' అంటారు ప్రముఖ సినీగేయ రచయిత దాశరథి. ఈ ఫొటోలోని వృద్ధురాలి జీవితంలో కూడా ఎంతో విషాదం ఉంది. మతిస్థిమితం లే(ద)ని ఈ అవ్వను ఏడాది కాలంగా గృహనిర్బంధం చేసిన సంఘటన మండలంలోని కోడూరు పంచాయతీ కొత్త కోడూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్త కోడూరు గ్రామానికి చెందిన రత్నమ్మ (58) మతిస్థిమితం సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఏడాది క్రితం దాకా తన అక్కతోడుగా ఉండేది. ఆమె చనిపోయిన తర్వాత, బావతో పాటు ఆమె తరపు బంధువులు రత్నమ్మ బాగోగులను విస్మరించారు. వారందరూ నెల్లూరులోనే కాపురాలు ఉంటున్నారు. రత్నమ్మను మాత్రం కొత్తకోడూరులోని ఓ పాడుబడ్డ ఇంట్లో నిర్బంధించారు. మతిస్థిమితం లేదన్న సాకుతో ఇంట్లోనే బంధించి బయటికి రానివ్వకుండా కట్టడి చేశారు. రత్నమ్మకు వచ్చే ప్రతి నెల రూ.6 వేల పింఛను, 25 కేజీల రేషన్ బియ్యాన్ని ఆమె బావ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమెకు ఒక పూట భోజనం పెట్టేందుకు ఒక మనిషిని నియమించి, నెలకి రూ. వెయ్యి చొప్పున ఆమెకు ఇస్తున్నాడు. జైల్లో ఖైదీ కన్నా అధ్వానంగా రత్నమ్మ ఆ పురాతన భవనంలోనే బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతోంది. భోజనం వరండాలో విసిరేసి వెళ్తుంటాడు. భోజనం, ఇతర కాలకృత్యాలన్నీ ఆ నాలుగు గోడల మధ్యనే తీర్చుకుంటోంది. రాత్రిపూట భయంతో పెద్దగా ఏడుస్తూ ఉందని, దీంతో తమకు కంటిమీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో రత్నమ్మ దుస్థితి గురించి స్థానికులు మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ప్రతీనెలా రత్నమ్మకు వచ్చే పింఛన్, రేషన్ తన బావ తీసుకుంటూ... ఆమెను ఓ పిచ్చిదానిలా ఒంటరిగా గృహ నిర్బంధం చేయడం అమానుషమని వారు చెబుతున్నారు. రత్నమ్మను ఇంటికి తీసుకెళ్లడమో లేదా వృద్ధాశ్రమంలో చేర్పించి సంరక్షించాలని ఆమె బావను, బంధువులను స్థానికులు కోరుతున్నారు.



ఇంటి ముందు కూర్చొని ఉన్న మతిస్థిమితం లేని రత్నమ్మ

జొన్నవాడ ఆలయ హుండీల లెక్కింపు

● 96 రోజుల్లో రూ.48,89,218 లక్షల ఆదాయం



హుండీలలోని నగదు లెక్కిస్తున్న భక్తులు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీమల్లికార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో బుధవారం ఆలయ ప్ర ధాన హుండీలు, అన్న ప్రసాద హుండీలను లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి మొత్తం రూ. 52 లక్షలకుపైగా ఆదాయం వచ్చింది. ప్రధాన హుండీల ద్వారా రూ. 48,89,218 లక్షలు, అన్న ప్రసాద హుండీల ద్వారా రూ.31,14,050 లక్షలు చేకూరింది. భక్తులు బంగారు 71 గ్రాములు, వెండి వస్తువులు 170 గ్రాములు హుండీల ద్వారా సమర్పించుకున్నారు. మరికొందరు భక్తులు 123 యూఎస్ఏ డాలర్లు, 15 కెనడియన్ డాలర్లు సమర్పించినట్లు ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. హుండీల లెక్కింపులో పలువురు పాలకమండలి సభ్యులు, పర్యవేక్షణాధికారి ఎన్. శ్రీధర్‌నాయుడు, స్థానిక ఏపీజీ బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది, ఎస్. సుబ్బరాయుడు ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా విశ్రాంత ఉద్యోగులు ఏఎస్ఐ వెంకయ్య, రెవెన్యూ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

● కూలిన ధ్వజస్తంభ కలశపీఠం

జొన్నవాడలోని శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం రెండేళ్ల క్రితం క్రితం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభంలోని శిఖరంలో కలశపీఠం (మేఖలాలు) వరకు ఉన్నఫళంగా విరిగి కిందపడింది. ధ్వజస్తంభానికి వాడిన కొయ్య నాసిరకమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు సుధాకర్ ఎంపిక



జేసీ వెంకటేశ్వర్లు నుంచి ఎంపిక పత్రం అందుకుంటున్న సుధాకర్

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మం డలం చెన్నారాయునిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ఏవీ. సుధాకర్ అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యాడు. బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆయనకు ఎంపిక పత్రం అందజేశారు. నవంబరులో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు వేల సంఖ్యలో పోటీ పడగా, నెల్లూరు జిల్లా వాసి సుధాకర్ ఎంపికయ్యాడు. ఈ నెల 6వ తేదీ నుంచి 9 వరకు పంజాబ్, హర్యాన ఉమ్మడి రాజధాని చండీఘర్‌లో జరగనున్న ఐఐఎస్ఎఫ్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి దిగ్గజ శాస్త్రవేత్తలు, నోబుల్ శాస్త్రవేత్తలు పాల్గొనే ఈ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం ఆనందగా ఉందన్నారు. అందులోను గురుకుల వర్క్‌షాప్, సైన్స్ సఫారీ, వైజ్ఞానిక విజన్ ఆఫ్ వికసిత్ భారత్ - 2047 మూడు విభాగాల్లోనూ తాను ఎంపిక కావడం మరింత ఆనందాన్ని కలిగించిందన్నారు.

వైభవంగా హనుమత్ వ్రతం

కావలి (టౌన్, ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఆటోనగర్ ట్రంకురోడ్డు వద్ద వెలసిన శ్రీహనుమత్ క్షేత్రంలో బుధవారం మనుమత్ వ్రత మహోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం హనుమంతుడికి పల్లకీ సేవలందించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రాష్ట్రంలో సుపరిపాలన

● జిల్లాల పునర్విభజనపై ఉపసంఘం దృష్టికి.. : దేవదాయ శాఖ మంత్రి ఆనం



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళితం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెలలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. బుధవారం రైతన్నా మీ కోసం, గురువారం అన్నీ నియోజకవర్గాల్లో డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవాలు, శుక్రవారం మెగా పీటీఎం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాల పునర్విజనపై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని, అభ్యంతరాలు, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఆనం తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవించద్ర మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పార్టీగా టీడీపీని బలోపేతం చేస్తామని, బూత్ లెవల్‌లో లోటుపాట్లను గుర్తించి సరిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, గిరినాయుడు, కేశవచౌదరి తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోండి

● కలెక్టర్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విజ్ఞప్తి



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుతూ హత్యకు గురైన పెంచలయ్య కుటుం బాన్ని అన్నీ విధాలా ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. పెంచలయ్య కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రస్తుతం పెంచలయ్య కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉందని, ఆ కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం, పెంచలయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి 2 ఎకరాల సాగు భూమి కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. యువత గంజా యి, మత్తుపదార్థాలకు అలవాటు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, షాహినాబేగం, పెంచలయ్య భార్య దుర్గ, పిల్లలు పాల్గొన్నారు.

దళితుల భూమిని కాజేసిన చరిత్ర నీది..!

● మాజీ మంత్రి కాకాణిపై మండిపడ్డ సోమిరెడ్డి



నెల్లూరు రూరల్ సీఐ వేణుకు ఫిర్యాదు అందచేస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దళితులు, రిటైర్డ్ ఉద్యోగుల భూములను, ఆస్తులను కాజేసిన చరిత్ర వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిదని, రూ. 60 కోట్ల విలువ చేసే ఆస్తులను సమాజానికి ఇచ్చిన చరిత్ర మా కుటుంబానిదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కాకాణిపై బుధవారం నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకాణి కండీషన్ బెయిల్‌పై ఉన్నాడన్న విషయాన్ని మరచి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న శివాలయానికి దశాబ్దాల క్రితం అల్లూరు శంకర్‌రెడ్డి అనే వ్యక్తి తన స్నేహితుడు డబ్బుగుంట రమణయ్య పేరుతో 48 సెంట్ల భూమిని ఇచ్చాడని తెలిపారు. ఇందులో 2005లో రోడ్డు నిర్మాణం జరిగేటప్పుడు 8 సెంట్లు పోయిందని, దానికి పరిహారం నేటికి అందలేదన్నారు. గుడికి, రోడ్డుకు మధ్యలో మరో 8 సెంట్లు, గుడి ఆవరణలో 15 సెంట్లు, గుడి దక్షిణాన 15 సెంట్లు మట్టి రోడ్డుగా ఉందన్నారు. ఇంకో 2 సెంట్లు జైన్ గుడిలో కలిసిందని తెలిపారు. ఇలా భూమి మొత్తం అక్కడే స్పష్టం కనిపిస్తుంటే, ఆ భూమంతా రియల్టర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కాకాణి అర్థంలేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వావిలేటిపాడు వద్ద రూ. 30 కోట్లు విలువ చేసే 4.70 ఎకరాల దళితుల భూమిని కాకాణి కాజేసిన విషయం వాస్తవంకాదా...? అంటూ సోమిరెడ్డి ప్రశ్నించారు. అక్కడే రిటైర్డ్ ఉద్యోగులకు ఉన్న 10 ప్లాట్లను తన కబ్జా ఖాతాలో వేసుకున్నాడని ఆయన వివరించారు. ఇరిగేషన్‌లో రూ. 150 కోట్లు దొంగ బిల్లులు చేసుకుని తినేశాడని సోమిరెడ్డి ఆరోపించారు. తనపై చేస్తున్న ఆరోపణలు, దూషణలపై విచారణ జరిపించాలని పోలీసులను కోరామన్నారు.

వ్యాధుల గుర్తింపులో బాధ్యతగా వ్యవహరించాలి : డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోగుల నుంచి రక్తనమూనాలు సేకరించి వ్యాధుల గుర్తింపులో ల్యాబ్ టెక్నీషీయన్లు బాధ్యతగా వ్యవహరించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత సూచించారు. బుధవారం ల్యాబ్ టెక్నీషీయన్ల సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగింది. ఆమె మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు రాత్రిపూట రక్తనమూనాలు సేకరిస్తుంటారని, వాటి ఫలితాలు వెంటనే వచ్చేలా కృషి చేయాలన్నారు. క్షయ అనుమానితులను త్వరగా గుర్తించి, వెంటనే వారికి వైద్య చికిత్సలు అందేలా చూడాలని ఆదేశించారు. జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ఏఎన్ఎంలు నాణ్యమైన రక్తపూతలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా సహాయ అధికారి నాగార్జునరావు, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిరుతిండికి దూరంగా ఉండాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చిరుతిండికి దూరంగా ఉండాలని వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్ సూచించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన జంకు ఫుడ్ తినడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12286
వెండి కిలో ధర	రూ. 183000
వెండి ఒక గ్రాము	రూ. 188.00

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం



ఆంజనేయస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సంగం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో బుధవారం హనుమత్ వ్రతం సందర్భంగా కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అరటి ఎండ్లు, తమలపాకులతో అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాల నడుమ సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఉదయగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని అన్నపూర్ణానగర్‌లో మంగళవారం రాత్రి అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని అయ్యప్ప మాలధారులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మెట్లను, విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయగిరితోపాటు పరిసర గ్రామాల మండలాలకు చెందిన మాలధారులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం బుధవారం రాత్రి పట్టణ పురవీధుల్లో అయ్యప్ప స్వామి గ్రామోత్సవం చేపట్టారు.

గంధ మహోత్సవం



పట్టణ పురవీధుల్లో గంధం ఊరేగిస్తున్న భక్తులు

ఉదయగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాదుకు చెందిన హజరత్ ఖాజా అబుల్‌ఫైజ్‌షా మహ్మద్‌ఖాలిద వజూది షంషీ వారి గంధమహోత్సవాన్ని ఉదయగిరిలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆస్థాన-ఎ-ఖాదరియా నుంచి గంధాన్ని మేళతాళాలు, ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గంధం అస్థానకు చేర్చి ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టారు. ఆస్థాన నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ గంధమహోత్సవంలో అస్థాన అధ్యక్షుడు అహ్మద్‌బాషా, నిర్వాహకులు మిఠాయిగిరి అహ్మద్, ఉస్మాన్ అలీ, పరుద్దీన్‌బాషా, ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారుల పరిశీలన

వింజమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఛిద్రమైన నడిమూరు దేవతా మహల్ సెంటర్ నుంచి శ్రీసరస్వతి హైస్కూల్ మీదుగా హైవే రోడ్డుకు వెళ్లే రహదారిని బుధవారం పంచాయతీరాజ్ శాఖ ఏఈ తిరుమలయ్య, పంచాయతీ ఈవో కె.రామారావు, సర్పంచ్ ఎన్.సుజనా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వీలైనంత త్వరగా రహదారి ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్మశానంలో ఇళ్ల నిర్మాణం తగదు

సీతారామపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి పంచాయతీలో నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించే స్థలం పూర్తిగా శ్మశాన వాటిక అని, శ్మశానంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వటం సమంజసం కాదని ఉదయగిరి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్త పరిచారు. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ ఎస్ఈ జయరాం చారికి వినతిపత్రం కూడా అందజేయడం జరిగిందని, అంతే కాకుండా జిల్లా కలెక్టర్‌ను వెంటనే మరొక చోట స్థలం కేటాయించాలని కోరడం జరిగిందని తెలిపారు.

జాదూ పిటారా బాక్సుల పంపిణీ

సీతారామపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పబ్బులేటిపల్లి, సీతారామపురం స్పెషల్, బెస్తకాలనీ ఆదర్శ పాథమిక పాఠశాలలకు సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన జాదు పిటారా కిట్ బాక్సులను బుధవారం స్థానిక విద్య వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి అందించారు. విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న పాఠశాలలను గుర్తించి కిట్లను అందించామన్నారు.

వర్షాలతో రైతుల్లో కలవరం



కోత దశలో ఉన్న వరి పంట

ఉదయగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాన్ ప్రభావంతో గత కొన్ని రోజులుగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో వర్షాలు కురుస్తుండడంతో రైతుల్లో కలవరం నెలకొంది. ప్రధానంగా ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన సుమారు వంద ఎకరాల్లో వరి పంట కోతకు వచ్చింది. వర్షం దెబ్బకు దిగుబడి నేలపాలు కావడం, పంట నేలవాలితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి రైతులు వరి నారుమడులను సైతం సిద్ధం చేశారు. వరినారుమడుల్లో నీరు చేరితే కుళ్లిపోయే ప్రమాదముంది. ఇక పసుపు, మిరప, ఇతరత్రా పంటల్లో నీరు చేరితే తెగుళ్ల విజృంభించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముంది. దీంతో వర్షం దెబ్బకు మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు.

తరగతి గదుల్లోకి వర్షపునీరు

● విద్యార్థుల అవస్థలు



పల్లిపాళెం పాఠశాల తరగతి గది వరండాల్లోకి చేరిన వర్షపు నీరు

సంగం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో వర్షపునీరు చేరి విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగింది. దిత్వా తుపాన్‌తో గత మూడు రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు వర్షపునీరు వెళ్లే మార్గం లేక పలు పాఠశాలల ఆవరణలోకి, వరండాల్లోకి చేరడంతో విద్యార్థుల తరగతుల నిర్వహణకు ఆటంకం కలిగింది. అందులో భాగంగా అన్నారెడ్డిపాళెం ఉన్నత పాఠశాల ఆరణలో మోకాళ్ల లోతు వర్షపు నీరు చేరాయి. విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాలంటే వర్షపునీటిలో దిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నీటిలో పాములు సంచరిస్తుండడంతో సగం మంది విద్యార్థులు పాఠశాలలకు రావాలంటే భయపడుతున్నారు. అదేవిధంగా పల్లిపాళెంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పాఠశాల పల్లంగా ఉండడంతో వరండాల్లోకి వర్షపు నీరు చేరాయి. అంతేకాదు దువ్వూరు మెయిన్ ఆదర్శ పాఠశాల ఆవరణలో అడుగులోతు వర్షపునీరు చేరాయి. ఈ వర్షపునీటిలోనే నడుచుకుంటు విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లాల్సి వస్తుండడంతో అసౌకర్యానికి గురవుతున్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు



ఆత్మకూరు: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ సాంకేతిక సంస్థ పీడీ శారద

ఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత, రాబోయే సీజన్‌లో రైతులు ఆర్థికాభివృద్ధి పెంచే దిశగా రైతుసేవా కేంద్రాల పరిధిలో సుస్థిర, సమగ్ర ప్రణాళికలు తయారుచేయడం జరుగుతుందని వ్యవసాయ సాంకేతిక సంస్థ పీడీ ఏ శారద తెలిపారు. స్థానిక ఏఎంసీ కార్యాలయ ఆవరణలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఎంఏవో కె కిశోర్‌బాబు ఆధ్వర్యంలో సమగ్ర వ్యవసాయ ప్రణాళికలపై వ్యవసాయ, అనుబంధ శాఖల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యంతో అన్ని వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రైతుల నికర ఆదాయం పెంచేందుకు కృషి చేస్తారని తెలిపారు. ఆత్మ డీపీడీ ఐ మురళీ మాట్లాడుతూ రైతులు కేవలం వరి పంట వంటి సాంప్రదాయ పంటలే కాకుండా డిమాండ్ ఉన్న ఆధారిత పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వరి, ఇతర పంటల సాగులో ఖర్చు తగ్గించుకునే శాస్త్ర పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి కె రాజశేఖర్, పశుసంవర్ధక శాఖ ఏడీ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలు, పశువుల పెంపకంలో నికర ఆదాయం పెంచుకునే పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** పంటల సాగులో రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారి రామ్మోహన్, విజయ భాస్కర్ సూచించారు. బుధవారం మండలంలోని శకునాలపల్లి రైతుసేవా కేంద్రంలో రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగం అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ చర్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి వినయ్‌కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** స్థానిక రైతుసేవా కేంద్రం-2లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా వర్కుషాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయగిరి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్‌లు రైతులకు సుస్థిర, సమగ్ర వ్యవసాయ పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. పంట మార్పిడి పద్ధతులు, ఏఏ పంటలు వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు గోపికృష్ణ, టీడీపీ నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

●**సంగం:** మండలంలోని దువ్వూరు రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి శశిధర్ ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి శశిధర్ పంచ సూత్రాల గురించి వివరించారు. నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా ఉద్యానశాఖ అధికారి కార్తిక్ ఉద్యాన శాఖ పథకాలు, ఆయిల్ పామ్ సాగు గురించి వివరించారు. అనంతరం వెటర్నరీ అసిస్టెంట్, ఫిషనరీ అసిస్టెంట్‌లు పశు సంవర్ధక శాఖలో పథకాలు, చేపల పెంపకం, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ హరిరెడ్డి, సీఈవో వెంకటరమణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** రైతుల ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అనంతసాగరం చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రాపూరు సుబ్బారెడ్డి తెలిపారు. సాగరం సచివాలయంలో బుధవారం ఏవో శైలజాకుమరి ఆధ్వర్యంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాపూరు బుజ్జమ్మ, బీజేపీ మండలాధ్యక్షుడు వల్లూరు రాజేష్‌రెడ్డి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

●**వింజమూరు:** మండలంలోని గుండెమడకల గ్రామంలో బుధవారం రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు యాదవ్ ఆయన మాట్లాడుతూ రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏవో మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు, నాయకులు కర్ణం శ్రీనివాసన్‌నాయుడు, సీహెచ్.వెంకటేశ్వర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

● ప్రజలకు అందని రక్షిత నీరు



నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతిగృహం ప్రాంగణంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. రూ. లక్షలు వెచ్చించి నిర్మించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఫ్లోరిన్ రహిత నీటిని అందించాలనే సదుద్దేశంతో సమీప ఉదయగిరి మండలం గండిపాళెం జలాశయ ప్రాంగణంలో రాజీవ్ సబ్ మిషన్ పథకానికి నిర్మించడం జరిగింది. అందులో భాగంగా సురక్షిత నీటిని వరికుంటపాడు, కనియంపాడు గ్రామాలకు సరఫరా చేసేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకును ఏర్పాటు చేశారు. అయితే అనతికాలంలోనే పథకం మూలకు చేరడంతో ట్యాంకులు సైతం నిరుపయోగంగా మారాయి. దీంతో చుట్టూ కంపచెట్లు పెరిగి అడవిని తలపిస్తూ విష పురుగులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరుపయోగంగా మారిన ట్యాంకును వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసిన సంస్థ ప్రతినిధులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని మానవతా సంస్థ అధ్యక్షుడు వెండిదండి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం విరువూరు ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అనే అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావం, సమాజం పట్ల సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం గతేడాది ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదుతో పాటు మెమొంటో, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్ రామ్మోహన్‌రావు, మాజీ అధ్యక్షుడు పోలక తిరుపతిరెడ్డి, విద్యా కార్యదర్శి సేగు కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏపీ ఎన్జీవోల సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

ఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆత్మకూరు తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం ఆత్మకూరు పీడబ్ల్యుడీ కాంపౌండ్‌లో సోమశిల ప్రాజెక్ట్ డివిజన్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణ జరుగుందని ఆత్మకూరు తాలూకా ఎన్నికల అధికారి ఏవి కృష్ణకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడతాయని పేర్కొన్నారు. సహాయ ఎన్నికల అధికారిగా నెల్లూరు సిటీ అధ్యక్షుడు సీహెచ్ రామకృష్ణారెడ్డి, ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్ పెంచలయ్యను జిల్లా అధ్యక్షులు నియమించారని తెలిపారు. ఆత్మకూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులందరూ ఈ ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఏపీఎన్‌జీవోస్ సంఘం ఎన్నికలు

వింజమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ వింజమూరు తాలూకా యూనిట్ ఎన్నిక ప్రక్రియ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 5వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందని వింజమూరు తాలూకా ఎన్నికల అధికారి, కావలి తాలూకా అధ్యక్షుడు శివసత్యనారాయణలు ఒక ప్రకటలో తెలిపారు. ఇందుకు సంబంధించి నవంబరు 19న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయని, సహాయ ఎన్నికల అధికారిగా కావలి తాలూకా కార్యదర్శి డీవీ నాగరాజు, ఎన్నికల పర్యవేక్షణకు జిల్లా ఉపాధ్యక్షుడు పి సతీష్‌బాబును జిల్లా అధ్యక్షులు నియమించారని తెలియజేశారు. కావున వింజమూరు తాలూకా పరిధిలోని ఉద్యోగులందరూ ఈ ఎన్నికల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి



ఉదయగిరి: పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఆత్మకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఎంఈవో అనంత లక్ష్మీ సూచించారు. బుధవారం ఆత్మకూరు పట్టణంలోని వెస్ట్ స్కూల్‌లో భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వారికి ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిత కేంద్రంలో చిన్నారులకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న చేయూతను వివరించారు. అనంతరం ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌పిఏ జయకుమార్, వెస్ట్ స్కూల్ ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** స్థానిక ఎంఈవో కార్యాలయంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఎంఈవోలు తిరుపతయ్య, ధనలక్ష్మి, రిసోర్స్‌పర్సన్ రాజేంద్రకుమార్, ఫిజియోథెరపీ వైద్యులు రఫీ తదితరులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కలీం, ఉపాధ్యాయులు రజియా, సుభాషిని, హసీనా, జయమ్మ, ఐఆర్పీ బోస్, పాఠశాల ఛైర్మన్ అనూష తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** స్థానిక బెస్త కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవోలు షేక్ మస్తాన్‌వలి, ప్రవీణలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, పీడి ప్రభాకర్, వెంకటేశ్వర రెడ్డి, హుస్సేన్, జి.వెంకటేశ్వర్లు, రవికుమార్ ,ఐఈఆర్‌పి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

అత్తింటి వేధింపులు తాళలేక
ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య



షేక్ కుబ్రా (ఫైల్)

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్తింటి వేధింపులు తాళలేక ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలోని నందిపాడు గ్రామంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంది పాడు గ్రామానికి చెందిన షేక్ మహ్మద్‌రఫీ మర్రిపాడు మండలం పెగళ్లపాడు మసీదులో ఇమామ్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఉదయగిరి పట్టణం దేవలాలగడ్డకు చెందిన షేక్ కుబ్రా(18)తో ఈ ఏడాది ఆగస్టు మాసంలో వివాహమైంది. వివాహం అయినప్పటి నుంచి అత్త, భర్త వేధింపులు అధికమయ్యాయి. ఈతరుణంలో ఇటీవల కుబ్రా వైద్యశాలకు వెళ్లడంతో అక్కడి వైద్యులు గర్భందాల్చినట్లు తెలిపారు. ఆనందంలో ఉన్న కుబ్రా తన పుట్టింటికి వెళ్లి వస్తానని కోరగా అందుకు వారు ససేమిరా అన్నారు. దీంతో మనస్తాపానికి గురైన కుబ్రా తన అత్త రసూల్‌బీ పని నిమిత్తం బయటకు వెళ్లడం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన అత్త ఉరి వేసుకుని వేలాడుతున్న కోడలిని చూసి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఉదయగిరి సీఐ వెంకటరావు, తహసీల్దారు యమనల నాగరాజు, ఎస్ఐ ఆదిలక్ష్మీలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి పెద్దమ్మ గౌసియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని ట్యాంకర్ డ్రైవర్ దుర్మరణం

● పొలాల్లోకి దూసుకెళ్లిన లారీ

● మృతుడు కృష్ణాజిల్లా వాసి

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని జాతీయ రహదారిపై వీపీఆర్ విల్లాల వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... కృష్ణా జిల్లా చెర్లపల్లి ప్రాంతానికి చెందిన వీ సాంబశివరావు(64) పాల ట్యాంకర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. బుధవారం పాల ట్యాంకర్‌తో విజయవాడ నుంచి చెన్నైకు వెళ్తుండగా వీపీఆర్ విల్లా వద్ద వాహనం ఆగిపోయింది. దీంతో డ్రైవర్ సాంబశివరావు వాహనం దిగి పరిశీలిస్తుండగా వెనుక నుంచి ధాన్యం లోడుతో వేగంగా వస్తున్న లారీ ఆయనను ఢీకొని రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల దొంగ అరెస్ట్

● 10 బైకులు, రెండు ఆటోల స్వాధీనం



నిందితుడి వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుసగా వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఘరానా దొంగను నెల్లూరులోని చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వివరాలను బుధవారం ఆ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు విలేకర్లకు వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 22న మనుబోలు మండలం కాగితాలపూరుకు చెందిన మీర్జా జుల్ఫీకర్ ఆలీ ఆటోలో నెల్లూరుకురాగా నగరంలో ఆ వాహనం మాయమైంది. అతని ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా నిందితుడు నెల్లూరు రూరల్ మండలం ఎలమవారి దిన్నె ప్రాంతానికి చెందిన పనికి కల్యాణ్‌కుమార్‌గా గుర్తించారు. ఆటోతో నిందితుడు పరారవుతుండగా బుధవారం అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారించగా రెండు ఆటోలు, పది బైక్‌లు దొంగలించినట్లు అంగీకరించాడు. దీంతో రూ.5.20 లక్షల విలువచేసే ఆ 12 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎస్కే అబ్దుల్ రజాక్, క్రైమ్ పార్టీ సిబ్బంది సురేష్‌బాబు, ఎస్వీ శ్యామ్ ప్రసాద్, ఎం సుబ్బారావు, సీహెచ్‌కే వర్ధన్, ఎస్కే రియాజుద్దీన్, కే దేవనాయుడు, ఎన్ దయాశంకర్, కే విజయ కుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఉద్యోగం పేరిట రూ.లక్షలు దోచేశాడు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షలు దోచేసిన వ్యక్తిపై సంతపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట ప్రాంతం మాగుంటనగర్‌కు చెందిన కామాక్షి మంచాలు అల్లుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమెకు ఏడేళ్ల క్రితం కడప జిల్లాకు చెందిన నారుబోయిన రాజశేఖర్ పరిచయం అయ్యాడు. ఉద్యోగం ఇప్పిస్తానని ఆమెను నమ్మించి 2021లో రూ.5లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో కామాక్షి గట్టిగా నిలదీసింది. దీంతో రూ.1లక్ష నగదు వెనుకకు ఇచ్చాడు. అయితే ఆమె తనకు నగదు అవసరం ఉందని చెప్పడంతో వారి వద్ద బంగారు నగలు తీసుకొని ముత్తూట్ ఫైనాన్స్‌లో గోల్డ్ లోన్ తన పేరుపై పెట్టి నగదు ఇప్పించాడు. అయితే ఆ లోన్‌లో కామాక్షికి చెప్పకుండా నగదు తీసుకున్నాడని ఫైనాన్స్ వారు చెప్పడంతో ఆమె బుధవారం సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి మృతదేహం కోసం గాలింపు

ఉదయగిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గోరఖ్‌పూర్ జిల్లా నగన్వ గ్రామానికి చెందిన సౌరభ్‌కుమార్ మంగళవారం గల్లంతైన విషయం విధితమే. అయితే యువకుడి మృతదేహం కోసం ఎస్ఐ అల శ్రీను అగ్నిమాపక సిబ్బంది, మత్స్యకారుల సహకారంతో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. పడవ సహాయంతో జలాశయం నీటిలో గాలాలు వేసి గాలింపు చేపడుతున్నా మృతదేహం ఆచూకీ లభ్యం కాలేదు.

పోలీసుల అదుపులో నిందితుడు

ఉదయగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లాయపల్లి ఎస్సీ కాలనీ సమీప అటవీ ప్రాంతంలో వదిన, మరదలిపై గొడ్డలితో దాడిచేసి పరారీలో ఉన్న బొబ్బా ఆదినారాయణను బుధవారం ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు.. గతనెల 29న అటవీ ప్రాంతానికి కట్టెల కోసం వెళ్లిన వరసకు వదినైన లక్ష్మీనరసమ్మ, మరదలైన కవితలపై బొబ్బా ఆదినారాయణ గొడ్డలితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చి పరారైన సంఘటన విధితమే. అయితే నాటి నుంచి ఎస్ఐ తన సిబ్బందితో ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈతరుణంలో బుధవారం కాలనీ సమీపంలో గాలింపు చేస్తుండగా అటవీ ప్రాంతం నుంచి కాలనీలోకి వస్తున్న ఆదినారాయణను తన సిబ్బందితో చాకచక్యంగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	139
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	274

కోడిగుడ్ల ధర (100): 670

వర్షాలు తగ్గాయి.. వరినాట్లు మొదలయ్యాయి !

జలదంకి, డిసెంబర్3 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలంలో బుధవారం తుఫాను ప్రభావం లేకపోవడంతో రైతులు వరినాట్లు మొదలుపెట్టారు. వర్షాలు అధికంగా కురిస్తే పొలాలు ముంపుబారిన పడతాయని వరినాట్లు నాలుగైదు రోజులుగా రైతులు నిలిపివేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుతం తిరిగి నాట్లు మొదలయ్యాయి. ఎక్కువ రోజులు నానితే వరినారు ముదిరిపోయి నాట్లకు వీలు లేకుండాపోతుందనే భయం రైతుల్లో నెలకొంది. వర్షం నిలిచిపోవడంతో అన్ని పంచాయతీల రైతులు చకచకా కూలీల చేత వరినాట్లు వేయించే పనిలో నిమగ్నమయ్యారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

జలదంకి, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం జలదంకి-1 రైతుసేవా కేంద్రంలో జరిగిన 'రైతన్నా.. మీకోసం' ముగింపు సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదయగిరి నియోజకవర్గంలోని రైతులకు రెండువిడతల్లో ఒక్కో రైతుకు రూ.14 వేల చొప్పున మొత్తం రూ.30 కోట్లు అందించామని ఏడీఏ శేషగిరిరావు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతీ రైతుకు ఎరువులు, విత్తనాలు సక్రమంగా అందించే బాధ్యత వ్యవసాయశాఖాధికారులదేనన్నారు. మండలంలో యూరియా పంపిణీ వివరాలను ఏడీఏతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యానాయుడును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కొత్తపాలెం, ఎల్.ఆర్ అగ్రహారం, గోపన్నపాలెం గ్రామాలకు ఇంతవరకు యూరియా ఎందుకు సరఫరా కాలేదని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీతామహాలక్ష్మి, ఏఓ శ్రీవాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి, సోమశిలప్రాజెక్ట్ వైస్ చైర్మన్ మదుమోహన్‌రెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రా రెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షుడు పూనూరు బాస్కర్‌రెడ్డి, జలదంకి సొసైటీ అధ్యక్షుడు అప్పలయ్యానాయుడు, కూటమి నేతలు చేపూరి జనార్ధన్‌రెడ్డి, నిమ్మలపల్లి రామ్‌చైతన్య పాల్గొన్నారు.


వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వృద్ధురాలిపై చేయి చేసుకున్న పోలీసులు

కావలి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విటులను పంపే మహిళగా వృద్ధురాలిని అనుమానించి, విచారణ నిమిత్తం 1వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి అక్కడ ఆమెపై పోలీసులు చేయి చేసుకున్న సంఘటన బుధవారం కావలి పట్టణంలో వెలుగుచూసింది. బాధితురాలి, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... కావలి మండలం తాళ్లపాలెం పంచాయతీ కోటడవికి చెందిన గోళ్ల బుజ్జమ్మ, చిన నరసయ్య దంపతులు రెండు సంవత్సరాలుగా కొడవలూరు మండలం రాజుపాలెంలో ఉండే కుమార్తె హరితమ్మ ప్రభుత్వ ఉద్యోగి కావటంతో ఆమె పిల్లలను చూసుకుంటూ ఇంటి వద్ద ఉంటారు. ప్రతి నెల దంపతులు ఇద్దరు కోటడవికి వచ్చి పెన్షన్ తీసుకుని వెళ్తుంటారు. ఈ క్రమం లో ఈ నెల 1వ తేదీన పెన్షన్ కోసం గ్రామానికి వచ్చిన దంపతులు పెన్షన్ తీసుకుని 2వ తేది రాజుపాలెం వెళ్లేందుకు కావలి ఆర్టీసీ డిపోకు వచ్చారు. రెండు రోజుల క్రితం డిపో లో ఒక మహిళ మీకు అమ్మాయిలు కావాలంటే నా వద్ద ఉన్నారని కొత్తసత్రంకు చెందిన ఒక యువకుడి నుండి రూ. 5000 నగదు తీసుకుని ఉడాయించింది. అతడి ఫిర్యాదు తో పోలీసులకు డిపోలో లభించిన సీసీ పుటేజ్ ఆధారంగా నగదు తీసుకున్న మహిళగా అనుమానించి పొరపడిన పోలీసులు నీపై కేసు ఉంది, స్టేషన్‌కు రావాలని ఆమె భర్తను డిపోలో ఉంచి వృద్ధురాలిని పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లారు. అక్కడ విచారణ లో భాగంగా వృద్ధురాలిపై పోలీసులు చేయి చేసుకోగా, విషయం తెలుసుకున్న గ్రామ నాయకుడు అక్కడికి వచ్చారు. వారు అలాంటి వారు కాదని, మీరు చెప్పినప్పుడు విచారణకు తీసుకువస్తామని ఆమెను పంపించారు. డిపోకు వెళ్లిన వృద్ధురాలు భర్తతో కలసి రాజుపాలెం వెళ్లి జరిగిన సంఘటన కుమార్తెకు, బంధువులకు చెప్పటంతో వారు కావలి చేరుకుని దవడకు గాయం కావటంతో ఏరియా వైద్యశాలలో చేర్పించారు. విషయం తెలుసుకున్న రెండవ పట్టణ సీఐ గిరిబాబు, 1వ పట్టణ ఎస్ఐ సుమన్ అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు డీఎస్పీ శ్రీధర్ ను కలిసి విన్నవించుకోగా ఫిర్యాదితో పాటు చేయి చేసుకున్న పోలీసులను పిలిపించి విచారించాలని 6వ తేదీ వచ్చి కలవాలని వృద్ధురాలి కుటుంబ సభ్యులకు డీఎస్పీ చెప్పి పంపించారు.


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బుజ్జమ్మ

నీట మునిగిన వరి నారుమడులు

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో దిత్వా తుఫాన్ వల్ల నారుమడులు నీట మునిగాయి. ముందస్తుగా నార్లుపోసుకుని నాట్లు వేసుకుంటున్న రైతులకు దిత్వా తుఫాన్ శాపంగా మారింది. బిట్రగుంట, నాగులవరం, ముంగమూరు, ఏనుగులబావి, ఎస్సీపాలెం తదితర పంచాయతీలో నారుమడులు పూర్తిగా నీట మునిగి, చెరువులను తలపిస్తున్నాయి. కడనూతల చెరువు కలుజులు పారుతుండటంతో పోసిన నారుమడులు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. బిట్రగుంటలో 5 వందల ఎకరాలు, ముంగమూరులో 3 వందల ఎకరాలు, నాగులవరంలో 6 వందలకు పైగా వరి మడులు నీట మునిగి రైతులు అవస్థలు పడుతున్నారు.


బిట్రగుంటలో నీట మునిగిన వరిమడులు

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

కావలి (టౌన్) డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం బుధవారం కావలి పట్టణంలో ఘనంగా జరిగింది. మున్సిపాలిటీ మెప్మా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పాల్గొని విభిన్న ప్రతిభావంతులచే కేక్ కట్ చేయించారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రూ, 10,65,000 చెక్కును అందించి విభిన్న ప్రతిభావంతురాలైన మెప్మా సిబ్బంది సునీతను సత్కరించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఫణికుమార్, టీడీపీ నాయకులు జ్యోతి బాబురావు, మెప్మా సిబ్బంది భారతి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు. తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలోని భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో గోవిందయ్య, ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య పాల్గొని చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం అధ్యక్షురాలు నాగమణి, భవిత సెంటర్ ఉపాధ్యాయిని మంచికలపాటి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ముసునూరు దివ్యాంగుల కాలనీలో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు, న్యాయవాది ఐ సాయిప్రసాద్, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

బీజేపీ నేత చంద్రప్ప దంపతులకు సన్మానం

కావలి (టౌన్) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రప్ప దంపతులను బుధవారం పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. తిరుపతి వెళుతూ మార్గమధ్యంలో కావలి నాయకులు ఆహ్వానం మేరకు పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన చంద్రప్ప దంపతులను శాలువాతో సత్కరించారు. పార్టీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కష్టపడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, బీజేపీ కిసాన్ మో ర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, పరుసు వెంకటేశ్వర్లు, వెంకటరమణా రెడ్డి, మంద కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ చంద్రప్ప దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం

కందుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్ధనస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది మాలధారులు ఈ వ్రతంలో పాల్గొనగా ఆలయ అర్చకులు అనంత్‌స్వామి, కిషోర్‌స్వామిలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో గురుస్వాములు ప్రసాద్‌స్వామి, గడిపూడి ప్రసాద్, ఛైర్మన్ ఆలూరి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ

● వాగు పొంగితే తప్పని అవస్థలు

ఉలవపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని కొల్లూరుపాడు ఎస్సీ కాలనీలో సమస్యలతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రం ఉలవపాడుతోపాటు, పక్క గ్రామాలతో కూడా సంబంధాలు తెగిపోతాయి. జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న ఎస్సీ కాలనీవాసులు ప్రతి చిన్న పనికి మండల కేంద్రం ఉలవపాడుకు రావాల్సి ఉంటుంది. ఆ కాలనీకిపోయే రహదారిలో వాగు చప్టా ఉంది. భారీ వర్షాలకు పైఎత్తున ఉన్న పొలాలు, కరేడు పంట కాలువకు వచ్చే వరద నీరు ఈ వాగు చప్టా మీద ప్రవహిస్తాయి. దీంతో కొల్లూరుపాడు రెండు ఎస్సీ కాలనీలకు చెందిన ప్రజలు వరద నీళ్ల తగ్గేవరకు బయట గ్రామాలకు వెళ్లే మార్గం లేదు. ఉలవపాడు జాతీయ రహదారి నుంచి కొల్లూరుపాడు ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో కనీసం వీధి దీపాలు కూడా లేవు. గత కొన్నేళ్ల నుంచి చిమ్మచీకటిలోనే బిక్కుబిక్కుమంటు పాదచారులు ఆరోడ్డున వెళుతున్నారు. రాత్రివేళ కాయాకష్టం చేసుకొని ఉలవపాడు నుంచి కొల్లూరుపాడుకు వెళ్లే పాదచారులు పొలాల మధ్య బాటలో వెళ్లాల్సి ఉంది. వీధి దీపాలు లేకపోవడంతో విషపురుగులు, పాములతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలి.


కొల్లూరుపాడు ఎస్సీ కాలనీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

పెద్దకొండూరులో 'రైతన్నా.. మీకోసం...'

కలిగిరి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండూరు సచివాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతుసేవా కేంద్రాలద్వారా అందిస్తోందన్నారు. పంటల సాగులో వ్యవసాయశాఖాధికారుల సలహాలను పాటించాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్‌కే జహీర్, మాజీ సర్పంచ్ ముక్కా హజరత్‌బాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెల్లంకి కొండపనాయుడు పాల్గొన్నారు.

● కొండాపురం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మి పంచాయతీ రైతు సేవాకేంద్రంలో మండల వ్యవసాయ అధికారి ఎన్ శ్రీహరి నారాయణ ఆధ్వర్యంలో బుధవారం రైతన్నా మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్ర వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, పంట మార్పిడి పద్ధతుల గురించి వివరించారు. పంటల సాగుకు ఎటువంటి పద్ధతులు అవలంబిస్తే రైతులకు అధిక ఆదాయాన్ని పొందుతారు అనే అంశాలపై వివరాలను రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి సురేంద్ర, దేవినేని వెంకటసుబ్బయ్య రైతులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీహరి నారాయణ

గుండె పోటుతో రైల్వే ఏసీ మెకానిక్ మృతి


అరసన్ మృతదేహం

కావలి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా హజరత్ నిజాముద్దీన్ నుండి మదురై వెళ్లే తమిళనాడు - సంపర్‌క్రాంతి సూపర్ ఫాస్ట్ రైల్లో ఏసీ మెకానిక్ తమిళనాడు కు చెందిన అరసన్ (46) విధులు నిర్వహిస్తూ ప్రకాశం జిల్లా శింగరాయకొండ వద్ద గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. దీంతో తోటి ఉద్యోగులు, ప్రయాణీకులు గుర్తించి అరసన్‌ను కావలి రైల్వే స్టేషన్లో దింపి 108కు సమాచారమిచ్చారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు. జీఆర్పీ ఎస్ఐ వెంకట్రావ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● విద్యుదాఘాతంతో ఆవు..

కావలి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రాంనగర్ కొరియర్ ఆఫీస్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్‌కు విద్యుత్ సరఫరా కావటంతో బుధవారం విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. రోడ్డుపై ఉన్న వర్షపు నీళ్లకు విద్యుత్ సరఫరా అయ్యిందని, ఆ నీటిలో కాలు పెట్టిన రూ. 80,000 విలువ చేసే ఆవు మృత్యువాత పడిందని రాంనగర్‌కు చెందిన యజమాని కొమ్మి మాల్యాద్రి వాపోయాడు. ప్రభుత్వం తనకు పరిహారం అదించాలని కోరారు.

భవిత కేంద్రాలతో బంగారు భవిష్యత్తు

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు భవిత కేంద్రాలలో బంగారు భవిష్యత్తు లభిస్తుందని కందుకూరు ఎంఈఓ ఎం నాగకుమారశర్మ అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక అభ్యుదయ పాఠశాలలోని భవితకేంద్రంలో ఐఈఆర్పీ కూనం ఉదయలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దివి కోటేశ్వరరావు, విద్యాకమిటీ ఛైర్మన్ శ్రావణి, సీఆర్పీ రమణారెడ్డి పాల్గొన్నారు.

సబ్ కలెక్టరును కలిసిన సక్షమ్ కార్యకర్తలు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కందుకూరు సక్షమ్ దివ్యాంగ సేవాకేంద్రం తరపున సక్షమ్ కార్యకర్తలు, కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులు సబ్ కలెక్టరు హిమవంశీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చన్నా వెంకటరామాంజనేయులు, కరస్పాండెంట్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించండి

ఉలవపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా పరిశీలకులు, డైట్ సీనియర్ లెక్చరర్ విజయకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని భీమవరం మెయిన్, ఏపీపీ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరుపట్టీలను తనిఖీ చేశారు. అలాగే పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, హెచ్‌ఎం వి రమేష్, బీవి నాగమణి పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు నిత్యావసరాల అందజేత

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ కళాశాల ఈఈఈ డిపార్ట్మెంట్ సౌజన్యంతో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో ఎయిడ్స్ డేని పురస్కరించుకుని బుధవారం పలుచోట్ల రోగ పీడితులకు చేయూతనందించారు. ముంగమూరు జాతీయ రహదారి వద్ద ఉన్న భవానీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎయిడ్స్ ఆదరణ కేంద్రంలోని బాధితులకు పండ్లు, బిస్కెట్లు, ప్లేట్లు, గ్లాసులతో పాటు బియ్యం, కందిపప్పు, చింతపండు తదితర వస్తువులు అందచేశారు. కావలి రూరల్ తాళ్ళపాలెంలోని రూరల్ హెల్త్ సెంటర్‌లోని అనాధ బాలబాలికలు, రోగులకు కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి చేతుల మీదుగా వితరణలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఈఈఈ హెచ్ ఓడీ డాక్టర్ వీ రవీంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్ కుమార్, ఈఈఈ డిపార్ట్మెంట్ అధ్యాపకులు ఉన్నారు.



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఆర్ఎస్ఆర్ విద్యార్థులు

కండేవారిబీడులో ఆక్రమణల గుర్తింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లింగసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఆర్ పాలెంలో కండేవారిబీడులో ప్రభుత్వ భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్న ఆక్రమణదారులను గుర్తిస్తున్నట్టు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం రమణయ్య తెలిపారు. ఈనెల 1న ఆంధ్రజ్యోతిలో కండేవారి బీడులో 400 ఎకరాల ప్రభుత్వ భూముల కబ్జా శీర్షికన వచ్చిన వార్తకు తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు స్పందించారు. దీంతో తహసీల్దార్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఆర్ఐ రమణయ్య, వీఆర్ఓ సుబ్బారెడ్డి, సర్వేయరు వెంకటేశ్వరరెడ్డిలు బుధవారం ఉదయం కండేవారి బీడులోని ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణలను పరిశీలించారు. గురువారం కూడా భూముల ఆక్రమణలను పరిశీలించి ఎంతమంది సాగు చేస్తున్నది గుర్తించి, దీనిపై నివేదికను రూపొందించి తహసీల్దార్ కోటేశ్వరరావుకు అందజేస్తామని, ఆయన ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.



బీడులో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్ఐ రమణయ్య, ఇతర అధికారులు

జనవరి నాటికి కందుకూరు ప్రకాశంలోకి..

● భారీ ర్యాలీ ● కూటమి నేతల చిత్రపటాలకు పాలభిషేకం

కందుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ చర్యల ఫలితంగా గత మూడున్నరేళ్లుగా కందుకూరు నియోజకవర్గ ప్రజలు అనేక అవస్థలు పడ్డారని, కూటమి ప్రభుత్వం వారి కష్టాలు తీరుస్తూ కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ చారిత్రక నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. జనవరి కల్లా కందుకూరు నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో అంతర్భాగమవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతగా తెలుగుదేశం, ఇతర కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు విద్యార్థులు, వ్యాపారులు, మహిళలు, డాక్టర్లు, లాయర్లు ఈ ర్యాలీలో భాగస్వాములయ్యారు. పామూరు బస్టాండ్ సెంటర్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరగ్గా మార్గమధ్యంలో దివంగత ఎన్టీఆర్, అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో నరేంద్రమోడీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేష్, ఇంటూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్లా శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పూరిమెట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహ్మం, జనిగర్ల నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, రాచగర్ల సుబ్బారావు, ఉన్నం వీరాస్వామి, చదలవాడ కొండయ్య, రాయపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఇతర టీడీపీ నాయకులు

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో మంచి లాభాలు పొందవచ్చునని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మండలంలోని కొండముడుసుపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులకు రైతు సేవాకేంద్రం ద్వారా ఎరువులు, పశువుల మేతను ఎమ్మెల్యే పంపిణీచేశారు. కార్యక్రమంలో వెటర్నరీ డీడీఏ సుధాకర్‌రాజు, ఏడీ చంద్రమౌళి, కందుకూరు ఇంచార్జి ఏడీఏ కేవీ శేషారెడ్డి, ఏఓ అబ్దుల్‌రహీం, హెచ్‌ఓ జ్యోతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చర్చి అక్రమ నిర్మాణాన్ని ఆపాలని సబ్ కలెక్టరుకి వినతి

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని దూబగుంట ఎస్సీ కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న చర్చిని తక్షణం నిలిపివేయాలని ఆ కాలనీకి చెందిన దళిత నాయకుడు పల్నాటి చెన్నయ్య బుధవారం సబ్ కలెక్టరు హిమవంశీని కలిసి ఫిర్యాదుచేశారు. సర్వేనెంబరు 93,93లలో ఉన్న 10సెంట్లు ప్రభుత్వస్థలాన్ని ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా చర్చి నిర్మిస్తున్నారని చెన్నయ్య సబ్ కలెక్టరుకు వివరించారు. ఈ సమస్యపై తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని సబ్ కలెక్టరు హామీ ఇచ్చారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

జలదంకి, డిసెంబర్3(ఆంధ్రజ్యోతి): జలదంకి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సీతామహాలక్ష్మిని మండల టీడీపీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నేతలు తహసీల్దారు దృష్టికి మండలంలో ప్రముఖంగా ఉండే పలు రెవెన్యూ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆమెను కోరారు. దీనికి స్పందించిన తహసీల్దారు ప్రభుత్వం విదించిన నిభందనల మేరకు తప్పక పరిష్కరిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో సోమశిలప్రాజెక్ట్ వైస్‌ఛైర్మన్ పి.మదుమోహన్‌రెడ్డి, జలదంకి సొసైటీ అధ్యక్షుడు కరియావుల అప్పలయ్యానాయుడు, నాయకులు జయచంద్రారెడ్డి, బాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అల్లూరులో చిరుజల్లులు


నిండుకుండలా అల్లూరు చెరువు

అల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావం తగ్గినప్పటికీ అల్లూరు మండలంలో బుధవారం చిరు జల్లులు కురిశాయి. మంగళవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో పనులకు ఆటంకం కలిగిందని వ్యవసాయ కూలీలు అంటున్నారు. వర్షపునీరు పొలాల్లో ప్రవహిస్తుండడంతో వరినాట్లు నిలిచిపోయాయని రైతులు వాపోతున్నారు. చలి కొంతమేర తగ్గుముఖం పట్టింది. దీంతో మళ్లీ ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వాగులూ వంకలు ప్రవహిస్తుండడంతో మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. తీరప్రాంతంలో సముద్రం కసురు మీద ఉండడంతో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంటున్నారు.

యూరియా సక్రమంగా అందించాలి

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరినాట్ల వేళ రైతులకు యూరియా సక్రమంగా అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని టీడీపీ రైతు సంఘం నేత యన్నాబత్తిన వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని నాగులవరం సొసైటీలో వ్యవసాయ అనుబంధ శాఖల వర్క్ షాప్ ఎంఏవో బిశైలజ ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ దేవసేన, పీఏసీఎస్ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు, టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పంటల మార్పిడి, డిమాండ్ ఆధారిత పంటల సాగు, నీటి వినియోగం, పంటసాగులో పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునే అంశాలపై ఏడీవో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్ సుధీర్‌బాబు, టీడీపీ జిల్లా రైతు కార్యదర్శి కోటా వెంకారెడ్డి, మండల యువతాధ్యక్షులు అనంగి ఆదిశేషయ్య, స్థానిక రైతులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

లింగసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఐఆర్టీలు సుప్రియ, శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 కె మాల్యాద్రి, ఎంఈఓ-2 ఎంవి శివకుమార్, ప్రధానోపాధ్యాయుడు ఎస్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఎం సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు ఎస్ఐగా సుబ్బారావు


బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సుబ్బారావు

ఉలవపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐగా జీ సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ, అక్రమ డీజిల్ దందా, పేకాట, కోడిపందేలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

'వాత్సల్య'కు విరాళం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ మినర్వా డెవలపర్స్ సంస్థ ఎండీ, నగరంలోని మూలాపేటకు చెందిన అబ్దుల్ రెహమాన్ బుధవారం తన తల్లి ప్యారిజాన్ స్మృత్యర్థం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయానికి రూ. 65వేలు విరాళం అందజేశారు.

పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

● ఫీజు చెల్లింపునకు ఈనెల 12 చివరి గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందుకు సంబంధించిన ఫీజు చెల్లింపునకు ఈ నెల 12వ తేదీ చివరి గడువుగా నిర్ణయించారు. ఈ విషయమై అనుబంధ కాలేజీలు, విభాగాలకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వర్సిటీ పరీక్షల డీన్ కొంగర సురేంద్రబాబు, పరీక్షల నియంత్రణాధికారి రాజమాణిక్యం తెలిపారు.



పెళ్లకూరు మండలం చిల్లకూరు, పెళ్లకూరు, పునబాక గ్రామాల్లో నీట మునిగిన పొలాలు

వాకాడు మండలంలో రొయ్యల కాలువ పొంగడంతో తెగిపోయిన ముట్టెంబాక-చిట్టమూరు రోడ్డు

చిట్టమూరు మండలంలో తెగిపోయిన మొలకలపూడి రోడ్డు

పెళ్లకూరు మండలం పాలచ్చూరు దళితవాడలో కూలిన ఇల్లు

దిత్వా ఎఫెక్ట్

ఏడు మండలాల్లో ముంచెత్తిన వాన

● వాకాడులో రికార్డు స్థాయిలో 28 సెంటీమీటర్ల వర్షపాతం

● వందలాది ఎకరాల్లో నీట మునిగిన వరి పొలాలు

● గోడ కూలి వృద్ధురాలి మృతి

● విందూరులో ఆటోరిక్షాపై కూలిన విద్యుత్ స్తంభం

● నీటి ఉధృతికి కొట్టుకుపోయిన మొలకలపూడి రోడ్డు



పెళ్లకూరు మండలం పునబాక ఆర్ అండ్ బీ రోడ్డుపై బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాను తరచూ తుఫాన్‌లు వెంటాడుతున్నాయి. నిన్నగాక మొన్న మొంథా తుఫాన్ మిగిల్చిన నష్టాలకు పరిహారం కూడా అందక మునుపే దిత్వా తుఫాన్ దూసుకొచ్చింది. వాయుగుండం నుంచి అల్ప పీడనంగా బలహీనపడినప్పటికీ జిల్లాపై మాత్రం ప్రభావం కనబరిచింది. గత నెల 30న తుఫాన్ ప్రభావం మొదలైనప్పటికీ మొదటి మూడు రోజులూ మోస్తరు వానలే కురిశాయి. అయితే మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకూ 22.30 గంటల వ్యవధిలోనే ఏడు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. వందలాది ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. కూరగాయల పంటలు సైతం అక్కడక్కడా దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం తమకు 270 ఎకరాల్లో మాత్రమే వరిపొలాలు నీట మునిగినట్టు సమాచారం వచ్చిందని తెలిపారు.

ఏడు మండలాల్లో భారీ వర్షాలు

దిత్వా తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 6 గంటల నడుమ జిల్లాలోని సముద్రతీర ప్రాంత ఏడు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. వాకాడు మండలంలో రికార్డు స్థాయిలో 280 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పొరుగునే ఉన్న చిట్టమూరు మండలంలో సైతం 261.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోట మండలంలో 220, దొరవారిసత్రం మండలంలో 135.8, నాయుడుపేటలో 115.2, ఓజిలిలో 109.4, తడలో 93.8 మిల్లీ మీటర్లు చొప్పున వర్షపాతం నమోదైంది. దిత్వా తుఫాన్ ప్రభావం గత నెల 30వ తేదీనే మొదలైనా ఆ రోజున కనిష్ఠంగా 4.8 మి.మీ.లు, గరిష్ఠంగా 45.2 మి.మీ.లు చొప్పున, ఈనెల 1న కనిష్ఠంగా 1.4 మి.మీ.లు, గరిష్ఠంగా 45.6 మి.మీ.లు వంతున, 2న ఉదయం 8.30 వరకూ అత్యల్పంగా 2 మిల్లీమీటర్లు, అత్యధికంగా 52.6 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతం నమోదవగా తర్వాతి 22.30 గంటల వ్యవధిలో తీర ప్రాంత మండలాల్లో రికార్డు స్థాయి వర్షాలు పడ్డాయి. ఈ భారీ వర్షాలకు స్వర్ణముఖి, కాళంగి, కైవల్య సహా పలు నదులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

ఉధృతంగా ప్రవాహాలు

● కోట మండలం గోవిందపల్లి వద్ద బకింగ్ హామ్ కెనాల్ పొంగి ప్రవహిస్తోంది.

● గూడూరు పంబలేరు చప్టాపై వరద నీరు ప్రవహిస్తోంది. వేములపాలెం చప్టాపై కూడా వరద నీటి ప్రవాహం మొదలైంది. విందూరు సమీపంలో రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. గూడూరు వద్ద కైవల్యా నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

● కోట మండలంలో స్వర్ణముఖి నది ఉధృతికి ఆనకట్టల నుంచి నీరు పరవళ్ల తొక్కుతున్నాయి.

● దొరవారిసత్రం తనియాలి వద్ద కాళంగి వంతెనపై వరద ప్రవాహం జోరందుకుంది. వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ పొంగడంతో వంతెనపైకి వరద నీరు చేరింది. పూలతోట సమీపంలో సూళ్లూరుపేట-వాకాడు రోడ్డు వంతెనపై కన్న కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళంగి నది, పాల కాలువ, నెర్రి కాలువ, కన్న కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

● వాకాడు మండలం దుగరాజపట్నం నుంచి కొండూరుపాళెం వెళ్లే రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. వాకాడు స్వర్ణముఖి బ్యారేజీలోకి 14 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా 11 గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వందలాది ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు





పెళ్లకూరు మండలం నెలబల్లి చెరువు తూముకు ఇరువైపులా గండ్లు పడగా ఇసుక బస్తాలు వేస్తున్న రైతులు - మృతిచెందిన రేణుకమ్మ

● తడ మండలం కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు, కారిజాత, కొండూరు, గ్రద్దగుంట గ్రామాల్లో వెయ్యి ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి.

● గూడూరు చల్లకాలువ సమీపంలో పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. పంటలు నీట మునిగాయి.

● చిట్టమూరు మండలం కొత్తగుంటలో వరినాట్లు నీట మునిగాయి.

● పెళ్లకూరు మండలం చిల్లకూరు, పెళ్లకూరు, పునబాక, కొత్తరు, అక్కగారిపేట, టెంకాయతోపు, భీమవరం, నెలబల్లి గ్రామాల్లో వందల ఎకరాల వరిపొలాలు నీటిపాలయ్యాయి.

● చిల్లకూరు మండలం పారిచర్ల వద్ద పొలాల్లోకి నీరు ప్రవేశించింది.

● సూళ్లూరుపేట మండలం కొరిడి, పేర్నాడు, దామరాయి, మంగళంపాడు, మన్నే ముత్తేరి గ్రామాల్లో పంటపొలాలు నీట మునిగాయి.

● కోట మండలం వెంకన్నపాలెం, తిమ్మానాయుడుపాలెం గ్రామాల్లో పంట పొలాలన్నీ నీట మునిగాయి.

● ఓజిలి మండలం పున్నేపల్లి-సుగుటూరు రోడ్డులో మామిడి కాలువ పొంగడంతో కాపులూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

దిశ మార్చుకున్న దిత్వా

● పుదుచ్చేరి వైపు కదులుతున్న వాయుగుండం

● మరో రెండు రోజులు భారీ వర్షాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి కొనసాగుతోంది. దిత్వా తుఫాన్ చెన్నై సమీపంలో వరకు ప్రయాణించి మళ్లీ పుదుచ్చేరి వైపు దిశ మార్చుకుంది. బుధవారం సాయంత్రానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడింది. ఈ ప్రభావంతో తిరుపతి జిల్లాలో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. వర్షంతోపాటు గంటకు 55 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీయవచ్చునన్నారు. మరో రెండు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ప్రమాదాలు... స్తంభించిన రాకపోకలు



గూడూరు మండలం విందూరులో ఆటోపై కూలిన విద్యుత్ స్తంభం

● పెళ్లకూరు మండలం పాలచ్చూరు దళితవాడలో ఓజిలి మణెమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. పునబాక వద్ద శ్రీకాళహస్తి-నాయుడుపేట ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు బురదలో కూరుకుపోయింది. మామిడి కాలువ ఉధృతికి పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చెంబేడు చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరుకుంది. నెలబల్లి చెరువు తూముకు ఇరువైపులా గండ్లు పడ్డాయి. రైతులు ఇసుక బస్తాలతో వాటిని పూడ్చే పనిలో పడ్డారు.

● తొట్టంబేడు మండలం కాసరంలో ఇంటి గోడ కూలి వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన రేణుకమ్మ(60) గుడిసెలో నిద్రిస్తుండగా గోడ కూలడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది.

● గూడూరు మండలం విందూరులో విద్యుత్ స్తంభం కూలి పడటంతో ఆటో ధ్వంసమైంది.

● కోట మండలం చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ నీట మునిగింది. ● చిట్టమూరు మండలం మొలకలపూడి రోడ్డు వరద నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. రొయ్యల కాలువ ఉధృతికి మల్లాం-నాయుడుపేట మార్గంలో రాకపోకలు బంద్ అయ్యాయి. తీర ప్రాంత గ్రామాలైన బురదగాలి, కొత్తపాలెం, కుమ్మరపాలెం గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి.

● వాకాడు మండలంలో రొయ్యలకాలువ పొంగడంతో ముట్టెంబాక - చిట్టమూరు రోడ్డు తెగిపోయింది. స్వర్ణముఖి ఉధృతికి బాలిరెడ్డిపాలెం వద్ద వంతెనపైకి వరద నీరు చేరడంతో 16 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వాయిలపాలెం నుంచి కొండూరుకు వెళ్లే రోడ్డుపైకి వరద నీరు రావడంతో రాకపోకలు నిలిపివేశారు.

● గూడూరు - రాజంపేట రోడ్డు వర్షానికి దారుణంగా దెబ్బతింది. ● కోట మండలం రుద్రవరం వద్ద మామిడి కాలువ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

● చిల్లకూరు మండలం పారిచర్లవారిపాలెం వద్ద వరద నీరు కాజ్‌వే పైకి రావడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఉప్పుటేరు పొంగి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో తిప్పగుంటపాలెం జల దిగ్బంధంలో చిక్కుకుంది.

● బాలాయపల్లి మండలం నిండలి సమీపంలో కైవల్యానది ప్రవాహం బ్రిడ్జిపైకి రావడంతో నిండలి, వాక్యం, దగ్గవోలు తదితర గ్రామాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకూ రాకపోకలు ఆగిపోయాయి.

● తడ మండలం పూడి గ్రామంలోకి నీరు ప్రవేశించింది. కారిజాత చెరువుకు గండిపడింది. దీంతో రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.

డీఆర్సీ సమావేశాలకు కార్పొరేషన్ చైర్మన్లు

తిరుపతి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి కార్పొరేషన్ల చైర్మన్లకు జిల్లా సమీక్షా మండలి సమావేశాలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకూ ఈ సమావేశాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు మాత్రమే పాల్గొనేవారు. ప్రస్తుతం అదనంగా కార్పొరేషన్ల చైర్మన్లకు కూడా ప్రత్యేక ఆహ్వానితుల హోదాలో పాల్గొనేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్, జీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ కూడా డీఆర్సీ సమావేశాల్లో పాల్గొననున్నారు. రెండు నెలలకొకసారి విధిగా డీఆర్సీ సమావేశం నిర్వహించాలని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

శబరిమల యాత్రలో విషాదం

● కారు ప్రమాదంలో తండ్రీకుమారుల మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమలైకు వెళ్లిన తండ్రీకుమారులు కారు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మండలంలోని కారణి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వేణు(48) బేల్దారి కూలీ. కుమారుడు నరేష్(30) డ్రైవర్. వేణు, నరేష్, ఆయన కుమార్తె చాతుర్య అయ్యప్పస్వామి దీక్ష చేపట్టారు. ఈ నెల ఒకటో తేదీ ఉదయం వేణు, నరేష్, చాతుర్య(9)తో పాటు వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురానికి చెందిన మునితేజ కారణి గ్రామం నుంచి కారులో శబరిమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలోని తేని పట్టణ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే కూర్చున్న వేణు అక్కడికక్కడే మృతి చెందారు. మునితేజకు రెండు కాళ్లు విరిగిపోగా, చాతుర్యకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాలకు తేని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మునితేజ అక్కడే చికిత్స పొందుతున్నాడు. గురువారం మృతదేహాలు కారణి గ్రామానికి వస్తాయని తెలిపారు.



కాలువలో పడిపోయిన కారు

వేణు, నరేష్ మృతదేహాలు

వేడుకగా చొక్కాణి ఉత్సవం

శ్రీకాళహస్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మహానంది వద్ద బుధవారం రాత్రి చొక్కాని ఉత్సవం వైభవంగా సాగింది. తమిళ కార్తీక మాసాన్ని పురస్కరించుకుని చుక్కాని ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవానికి ఒకరోజు ముందు అంటే మంగళవారం రాత్రి ఆలయంలో వేదపండితులు కలశస్థాపనతో కృతవును శాస్త్రోక్తంగా ప్రారంభించారు. అమ్మవారి సన్నిధి వద్ద బాలదీపాలను వెలిగించి స్వామివారి సన్నిధి వద్ద భద్రపరిచారు. బుధవారం రాత్రి వరకు దీపాలు నిరంతరాయం వెలిగేలా ఏర్పాటు చేశారు. ఉదయం మహానంది వద్ద వేదపండితులు కలశానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాటిచెట్టుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తాటిచెట్టును మహానంది వెనుకవైపున నిలబెట్టారు. చుట్టూ మట్టలను కప్పారు. రాత్రి ఆలయం నుంచి బాలాదీపాలను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊరేగింపుగా తాటిచెట్టు వరకు తీసుకువచ్చి ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి చొక్కాణిని వెలిగించారు. చొక్కాణి జ్యోతి అఖండ ప్రజ్వలనతో ప్రకాశించింది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు సాయంత్రం నుంచే భక్తులు వర్షంలో తడుస్తూనే నిరీక్షించారు. చొక్కాణి పూర్తయిన తర్వాత అందులోని భస్మాన్ని ఈశ్వరప్రసాదంగా భావించి భక్తులు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



డివిజన్ స్థాయిలో మినీ కలెక్టరేట్లు

● పంచాయతీరాజ్‌లో కీలక సంస్కరణలు

● డివిజన్ స్థాయిలో ఒకే గొడుగు కిందకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు

● చిత్తూరు నుంచి డీడీవో కార్యాలయాలకు నేడు డిప్యూటీ సీఎం ప్రారంభోత్సవం

చిత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ సంస్కరణల్లో భాగంగా కూటమి ప్రభుత్వం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీవో)లకు విశేష అధికారాలను అప్పగించింది. డీడీవోల జాబ్‌చార్ట్‌ను మారుస్తూ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒకే పరిపాలన నియంత్రణలోకి తీసుకురానున్నారు. డివిజన్ స్థాయిలో ఉన్న పంచాయతీ ఆఫీసు (డీఎల్‌పీవో), డ్వామా ఏపీడీ, ఇతర శాఖల డివిజనల్ కార్యాలయాలను డీడీవో కార్యాలయాల సముదాయంలోకి మారుస్తున్నారు. డివిజన్ స్థాయిలో ఈ డీడీవో కార్యాలయాలు మినీ కలెక్టరేట్లుగా ప్రజలకు సేవలందించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీరాజ్ డివిజన్లను కూడా ఈ సబ్ డివిజన్లకు సమాంతరంగా ఏర్పాటు చేశారు. డీడీవోలకు కూడా అదే స్థాయిలో అధికారాలూ ఇచ్చారు. జిల్లాలో తిరుపతి, గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో డీడీవో కార్యాలయాలను గురువారం చిత్తూరు నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించనున్నారు.

డీడీవో నియంత్రణలో..

డివిజన్ స్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి విభాగాలను డీడీవో నియంత్రిస్తారు. డివిజన్ స్థాయిలో అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ సమీక్షలు నిర్వహిస్తారు. పాలనాపరంగా ప్రతి నెలా 20 రోజులు పర్యటించి టూర్ డైరీలను కలెక్టర్లకు సమర్పించాల్సి ఉంటుంది. ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సిబ్బంది డీడీవో నియంత్రణలో పనిచేస్తారు.

స్థానిక ఎన్నికల బాధ్యత

స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటివరకు డిప్యూటీ డిస్ట్రిక్ ఎలక్షన్ అథారిటీగా ఆర్డీవోలు ఉండేవారు. ఇక నుంచి డీడీవోలకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ పంచాయతీరాజ్ రూల్స్‌ను సవరించనున్నారు. నిజానికి వైసీపీ హయాంలో పెద్దఎత్తున ఎంపీడీవోలను డీడీవోలుగా ప్రమోట్ చేశారు. అయితే ఒక్కరికీ సరైన పోస్టింగు ఇవ్వలేదు. ఆయా డివిజన్ కేంద్రాల్లో ఉన్న ఎంపీడీవో కార్యాలయాల్లోనే డీడీవోలకు ఓ ఛాంబర్ కేటాయించారు. మొత్తానికి డీడీవో వ్యవస్థ వైసీపీ హయాంలో సర్వేలు, నామమాత్రపు పర్యవేక్షణకే పరిమితమైంది.


నెల్లూరు : అయ్యప్పగుడి వద్ద వాహనదారుల అవస్థలు


వెంకటాచలం మండలం చెముడుగుంట వద్ద జాతీయ రహదారిపై వరద నీరు


బుజబుజనెల్లూరులోని ఊరకుంట చెరువుకు పడిన గండి

తగ్గినట్టే తగ్గి...

ముంచెత్తింది!

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నెల్లూరుపై తీవ్రప్రభావాన్ని చూపింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షం తాకిడికి నెల్లూరు జలదిగ్బంధంలో చిక్కుకు పోయింది. నగర శివారు ప్రాంతం బుజబుజనెల్లూరు, తల్పగిరికాలనీ, రెవెన్యూ కాలనీ, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ తదితర ప్రాంతాలు ఉడుముల వాగు ఉధృతికి నీటమునిగాయి. పైనుంచి వచ్చిన వరద నీరు ఈ ప్రాంతాలలోని రోడ్లు, ఇళ్లను చుట్టుముట్టాయి. అయ్యప్పగుడి కూడలి వద్ద వరద భారీగా చేరుకోవడంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలుకు ఇబ్బంది ఏర్పడింది. పలు వాహనాలను దారి మళ్లించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని బయటకు పంపారు. ఇదే దుస్థితి బుజబుజ నెల్లూరులోనూ ఏర్పడింది. రెవెన్యూ కాలనీ వద్ద నీటిని బయటకు పంపేందుకు యంత్రాంగం తీవ్రంగా శ్రమించింది. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్, రామలింగాపురం ప్రాంతాల్లోని అండర్ బ్రిడ్జీలు నీటమునిగాయి. దీంతో ఈ మార్గాలలో కొన్ని గంటలపాటు వాహన రాకపోకలను ఆపేశారు. భారీ యంత్రాలతో ఇక్కడ నీటిని బయటకుతోటి యథాస్థితికి తీసుకువచ్చారు. గాంధీబొమ్మ, వీఆర్సీ, పొగతోట, జేమ్స్‌గార్డెన్, రామ్మూర్తినగర్, సుబేదార్‌పేట ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచింది. ఈ ప్రాంతాల్లోని మురుగు కాలువల సామర్థ్యం సరిపోకపోవడంతో మధ్యాహ్నం వరకు సాధారణ స్థితి కనిపించలేదు. ఇక రంగనాయకులపేట, పాతమున్సిపల్ ఆఫీస్, మను ముసుద్దీన్‌నగర్, కోటమిట్ట, ఇరగాలమ్మ సంఘం, కేవీఆర్‌కూడలి వద్ద భారీగా నీరు చేరింది. ఇదే దుస్థితి మాగుంటలేఅవుట్, గోమతినగర్, రవీంద్రనగర్‌లోనూ కనిపించింది. అటు నగరానికి ఉత్తారానున్న భగత్‌సింగ్‌కాలనీ, వెంకటేశ్వరపురం ప్రాంతాలు నీటి ముప్పును ఎదుర్కొన్నాయి. వైఎస్‌నగర్, ఆదిత్యనగర్, జనశక్తినగర్ ప్రాంతాలు రోడ్లు కనిపించనంతగా వర్షపునీరు చేరింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలో వాహన రాకపోకలు నిలిచాయి. కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


నెల్లూరు రూరల్ : సౌత్‌మోపూరులో మగ్గం గుంతల్లోకి వచ్చిన నీటిని తోడుతున్న కార్మికులు

● నాయకులు, అధికారుల సాయం

నెల్లూరులో వరదలో చిక్కుకున్న ప్రజలను కాపాడేందుకు అధికార పార్టీ నాయకులు, మున్సిపల్, పోలీసు యంత్రాంగం రోడ్డెక్కింది. ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తన బృందాలతో నీట మునిగిన కాలనీలు, రోడ్లు, కాలువల వద్ద పరిస్థితి పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వరద ప్రవాహాన్ని బయటకు పంపారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుజబుజనెల్లూరు, నేతాజీనగర్, కొత్తూరు, అయ్యప్పగుడి కూడలి, ఆటోనగర్ ప్రాంతాలలో పర్యటించారు. అధికారులతో కలిసి యంత్రాలతో కాలువల్లో పూడికతీసి నీటిని మళ్లించారు. 19 ప్రాంతాలలో పునరావాస కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిన కార్పొరేషన్ అధికారులు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్దనున్న చవటమిట్ట గిరిజన కాలనీ, నాగమ్మకాలనీ, నేతాజీనగర్, రామకోటయ్యనగర్ ప్రాంతాలలోని నీట మునిగిన నివాసాలకు ఆహార పదార్థాలను అందచేశారు.

● అలాగే నెల్లూరురూరల్లోని పంట పొలాలన్నీ నీట మునగగా, నారుమళ్లు గల్లంతు అయ్యాయి. పొట్టేపాళెం, ములుముడి కలుజుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండటంతో వాహన రాకపోకలను కొన్ని గంటల పాటు అధికారులు ఆపేశారు. సౌత్‌మోపూరు, ములుముడి, నారాయణరెడ్డిపేట గ్రామాలలో మగ్గం గుంతల్లోకి నీరు చేరింది. ఆయా గ్రామాలలోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.


నెల్లూరు : ట్రాక్టర్ మునిగి పోయింది. ఇప్పుడెలా!?


నెల్లూరు : ఉప్పొంగిన వాగు..


నీట మునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి


నెల్లూరు : ఇంటిలో నుంచి బయటకు వచ్చేదెలా!?

'దిత్వా' ప్రభావంతో రాత్రంతా భారీ వర్షం

చిగురుటాకులా వణికిన నెల్లూరు నగరం

మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరులోనూ అంతే!

తెగిన చెరువులు.. ఉప్పొంగిన వాగులు

రహదారులపైకి దూసుకొచ్చిన వరద

వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం

దిత్వా తుఫాన్ ముప్పు తప్పిందిలే అనుకున్నారంతా. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా వరుణుడూ తెరపివ్వడంతో ఊపిరి పీల్చుకున్నారు. కానీ రాత్రి ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. చిరుజల్లులతో ప్రారంభమైన వాన మోస్తరు.. ఆ తర్వాత భారీగా కురిసింది. రాత్రి 9 గంటల నుంచి బుధవారం ఉదయం దాకా తెరపివ్వకుండా వర్షం కురుస్తూనే ఉంది. జిల్లా సరాసరి 3.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదవగా అత్యధికంగా వెంకటాచలంలో 21.4 సెం.మీ, మనుబోలులో 15.4 సెం.మీ, ముత్తుకూరులో 12 సెం.మీ, నెల్లూరు నగరంలో 9.6 సెం.మీ చొప్పున వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వానకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగగా, రహదారులన్నీ జలదారులుగా మారిపోయాయి. ప్రధానంగా నెల్లూరు నగరంలోని చాలా ప్రాంతాలు నీట మునగడంతో నగరంలో జనజీవనం అస్తవ్యస్తమైంది. అలాగే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై వరద పోటెత్తడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. సౌత్‌మోపూరు సమీపంలో మొగళ్లపాలెం చెరువు తెగిపోయింది. కోవూరు మండలంలో సదరన్ ఛానల్‌కు గండి పడింది. ఇక భారీ వర్షాలు, వరదలతో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో సాగు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

చెన్నై హైవేపై వరద

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షానికి పోటెత్తిన వరదతో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి నిండిపోయింది. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్లే రహదారిపైకి వరద ఉధృతంగా చేరడంతో వాహనాలు నిలిపి వేశారు. అలాగే వెంకటాచలం సమీపంలో గూడూరు వైపు వెళ్లే జాతీయ రహదారి మీద కూడా వరద భారీగా చేరడంతో చెరువును తలపించింది. హైవేపై వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధవారం వేకువజాము నుంచి జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. అధికారులతో కలిసి పోలీసులు అప్రమత్తమై జేసీబీ సహాయంతో నీటిని పారద్రోలే చర్యలు చేపట్టారు. ఒకే మార్గంలో వాహన రాకపోకలు నెమ్మదిగా సాగాయి. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో రెండు మార్గాల్లోనూ వాహనాలను పునరుద్ధరించారు. అలాగే కంటేపల్లి - గొలగమూడి, గూడ్లూరువారిపాళెం - తిరుమలమ్మపాళెం గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉండే ప్రజలను అధికారులు ముందస్తుగా పునరావాస కేంద్రాలకు తరలించారు. వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ముందస్తు చర్యలు చేపట్టారు. కురిచెర్లపాడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మోకాలి లోతు వర్షపు నీరు చేరింది. ఇరిగేషన్ అధికారులు చెరువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కలుజు చెక్కలను ఎత్తివేసి వరదను దిగువకు వదిలి వేశారు. అధికారులతో కలిసి టీడీపీ నేతలు, కార్యకర్తలు తమవంతు సహాయక చర్యలు చేపట్టారు.


చెముడుగుంట వద్ద హైవే పైకి చేరిన వరద


మనుబోలు : పొదలకూరు రోడ్డుపై పొట్టేళ్ళవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పహారా కాస్తున్న పోలీసులు

తీరప్రాంత గ్రామాల్లో అవస్థలు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం అర్ధరాత్రి నుంచి కురిసిన వానకు మనుబోలు మండలం వణికిపోయింది. కండలేరు వాగు పొంగడంతో మనుబోలు-గూడూరు మధ్య రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే పొట్టేళ్ళ కాలువ పొంగి గొట్లపాళెం వద్ద మనుబోలు-పొదలకూరు మార్గంలోకి రావడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే వెంకన్నపాళెం వద్ద వాగులు పొంగి రోడ్డుపైకి నీరుచేరి 5 తీరప్రాంత గ్రామాల రాకపోకలకు ఆటంకం కలిగింది. ఇక పొట్టేళ్ళ వాగు ఇటు కొమ్మలపూడి రైల్వేబ్రిడ్జి కింద నిండుగా ప్రవహిస్తుండటంతో కొమ్మలపూడి, చెరుకుమూడి, ముద్దమూడి గ్రామాలకు వెళ్ళేందుకు దారి లేకుండా పోయింది. దారులన్నీ మూసుకుపోవడంతో బయట ప్రాంతాలకు రాకపోకలు సాగించలేక ప్రజలు అవస్థలు పడ్డారు. వందలాది ఎకరాల్లో నార్లు, నాట్లు మునిగిపోయాయి. కయ్యల్లో మోకాలి లోతు నీరు ఉండటంతో ఇక నార్లు, నాట్లు పనికిరావని అన్నదాతలు వాపోతున్నారు.

కావలిలో స్తంభించిన జనజీవనం

కావలి, (ఆంధ్రజ్యోతి) : బుధవారం ఉదయం గంటపాటు కురిసిన వర్షానికి కావలిలో జనజీవనం స్తంభించింది. ఇటీవల మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షాలకు ఇప్పుడు దిత్వా ప్రభావంతో కురిసిన వర్షాలకు పట్టణంలో అనేక రోడ్లు గుంతలమయంగా మారాయి. ప్రధానమైన ట్రంకు రోడ్డుతోపాటు జాతీయరహదారిగా ఉన్న కావలి-ఉదయగిరి రోడ్డు కూడా గుంతలమయంగా మారింది. దీంతో వాహనచోదకులు అవస్థలు పడితున్నారు. ఇక వైకుంఠపురంలోని అన్నపుగుంటను వరద ముంచెత్తడంతో తూముల వద్ద పెద్ద గుంతలు పడ్డాయి. నీటి ప్రవాహంలో ఆ గుంతలు కనిపించకపోవటంతో ఆ మార్గంలో రాకపోకలను ఆపివేశారు. ఇలా పట్టణంలోని అనేక లోతట్టు ప్రాంతాలతోపాటు మద్దూరుపాడు లోని టిడ్కో గృహవాసులకు కూడా నీటి ముంపు సమస్య తప్పలేదు.


కావలి : అన్నపుగుంట చాకలివీధి వద్ద రోడ్డుకు అడ్డంగా వేసిన కంప


సంగం : పల్లిపాళెం పాఠశాల ఆవరణలో వర్షపునీరు

507 హెక్టార్లలో నీటమునిగిన వరినాట్లు

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా కారణంగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతోపాటు కాలువల్లో పొంగి పొర్లుతున్న వరద కారణంగా జిల్లావ్యాప్తంగా బుధవారం సాయంత్రానికి సుమారు 507 హెక్టార్లలో వరినాట్లు నీటమునిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాకొచ్చింది. అదేవిధంగా 116 హెక్టార్లలో వరినారు కూడా నీటిలో మునిగింది. అత్యధికంగా కావలిలో 174 హెక్టార్లలో వరినాట్లు, 49 హెక్టార్లలో వరినారు మునిగినట్లు వ్యవసాయశాఖ లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు మండలంలో 124 హెక్టార్లలో వరి, 6 హెక్టార్లలో వరినారు, బుచ్చిరెడ్డిపాళెంలో 100 హెక్టార్లలో వరి, 20 హెక్టార్లలో నారు, కోవూరులో 48 హెక్టార్లలో వరి, 9 హెక్టార్లలో నారు, కొడవలూరులో 24 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారుమడి, సంగంలో 20 హెక్టార్లలో వరి, 10 హెక్టార్లలో నారు, బోగోలులో 17 హెక్టార్లలో వరి, 12 హెక్టార్లలో నారు నీట మునిగినట్లు అంచనా వేశారు. ఈ ఏడు మండలాల్లోని 29 గ్రామాల్లో దాదాపు 439 మంది రైతులకు చెందిన 507 హెక్టార్లలో వరి నీట మునిగిందనేది వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా.


చెరువు కాదండీ... మనుబోలులోని పంట పొలాలు

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

● స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అమోఘమని స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ అన్నారు. నగరంలో రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న వివిధ ప్రాజెక్టులను బుధవారం ఆమె సందర్శించారు. రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రాన్ని చూసి అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులతో సరదాగా గడిపారు. తలసీమియా విభాగాన్ని పరిశీలించి అక్కడ రక్తమార్పిడి జరుగుతున్న తీరును తెలుసుకున్నారు. రక్తనిధిని కూడా సందర్శించారు. రెడ్‌క్రాస్‌కు అన్నీ విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డి, వైస్ ఛైర్మన్ చామర్తి జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పేద బ్రాహ్మణ ఉన్నత విద్యా సహాయక ట్రస్ట్ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి ఉపకారవేతనాలకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ వై నాగదేవీప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం, బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

లారీ ఢీకొని ట్యాంకర్ డ్రైవర్ దుర్మరణం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరం లోని జాతీయ రహదారిపై వీపీఆర్ విల్లాల వద్ద బుధవారం లారీ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... కృష్ణా జిల్లా చెర్లపల్లి ప్రాంతానికి చెందిన వీ సాంబశివరావు(64) పాల ట్యాంకర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. బుధవారం పాల ట్యాంకర్‌తో విజయవాడ నుంచి చెన్నైకు వెళ్తుండగా వీపీఆర్ విల్లా వద్ద వాహనం ఆగిపోయింది. దీంతో డ్రైవర్ సాంబశివరావు వాహనం దిగి పరిశీలిస్తుండగా వెనుక నుంచి ధాన్యం లోడుతో వేగంగా వస్తున్న లారీ ఆయనను ఢీకొని రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో సాంబశివరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాలకు దెబ్బతిన్న రహదారుల పరిశీలన

వింజమూరు : వర్షాలకు ఛిద్రమైన నడిమూరు దేవతా మహల్ సెంటర్ నుంచి శ్రీసరస్వతి హైస్కూల్ మీదుగా హైవే రోడ్డుకు వెళ్లే రహదారిని బుధవారం పంచాయతీ రాజ్ శాఖ ఏఈ తిరుమలయ్య, పంచాయతీ ఈవో కె.రామారావు పరిశీలించారు.

భవిత కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రంగనాయకులపేట ఉర్దూ పాఠశాలలో ఉన్న అర్బన్ భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో తిరుపాల్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ అందించి వారి ఉన్నతికి పాటుపడాలన్నారు. వారి సామర్థ్యాలను బట్టి ఆయా విభాగాల్లో శిక్షణ అందిస్తే ప్రభుత్వం వారికి ఎన్నో అవకాశాలను కల్పిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందించే రాయితీలు, ఉపకరణాలు, రవాణా భత్యాలను అందరికీ అందించాలని, అవి అందని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువస్తే అందరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీ మంజుల, జూనియర్ అసిస్టెంట్ ప్రసాద్, ఆయాలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నీ రంగాల్లో రాణించాలి

నెల్లూరు (వైద్యం): దివ్యాంగులు అన్నీ రంగాలలో రాణించేలా కృషి చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని 47వ డివిజన్‌లో దివ్యాంగులను టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్ గణేష్ కుమార్‌తో కలిసి సన్మానించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కల్వకుంట భాస్కర్, మునిశేఖర్, ఫిరోజ్, అలేఖ్య, బెల్లంకొండ తులసి తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం 3.0 నిర్వహణకు

రూ.51.43 లక్షల మంజూరు

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వతేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం 3.0) నిర్వహణకు రూ.51,43,500 మంజూరైనట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో, డీఈఓ ఆధ్వర్యంలో జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రోగ్రస్ కార్డులు అందించడంతోపాటు పాఠశాలల అభివృద్ధి, చేస్తున్న, చేపట్టబోవు కార్యక్రమాలపై తల్లిదండ్రులతో ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే పాఠశాలల బలోపేతానికి సాయం చేసిన దాతలను సన్మానించడం, పాఠశాలల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ మెగా ఈవెంట్ ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని 2,608 పాఠశాలలకు రూ.51,43,500 కేటాయించామని పేర్కొన్నారు. 30 మంది పిల్లలున్న 1510 పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు రూ.900, 31-100 మంది పిల్లలున్న 663 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.2,250, 101-250 మంది పిల్లలున్న 287 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.4,500, 251-1000 మంది ఉన్న 147 పాఠశాలల్లో ఒక్కో దానికి రూ.6,750, వెయ్యిమందిపైన ఉన్న పాఠశాలకు రూ.9వేల చొప్పున నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

'సోమశిల'కు నిలకడగా వరద

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అంతగా లేకపోవడంతో సోమశిల జలాశయానికి ఆశించినరీతిలో వరద రావడం లేదు. గడిచిన నాలుగు రోజులుగా 20 వేల క్యూసెక్కుల దిగువనే ప్రవాహం కొనసాగుతోంది మంగళవారం 12,288 క్యూసెక్కులు వస్తుండగా బుధవారం సాయంత్రం 13,464 క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 70.514 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2000 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం: పాశం



శ్రీలక్ష్మమ్మగిరిజన కాలనీవాసులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు

కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న అతిభారీ వర్షాలకు ప్రజలు అధైర్యపడొద్దని... అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పలు ముంపు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే పాశం పర్యటించారు. ముందుగా పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీలో దెబ్బతినన్న పూరిగుడిసెలను ఎమ్మెల్యే పరిశీలించారు. కాలనీవాసులకు దుప్పట్లను అందజేశారు. అనంతరం చల్లకాలువ, పంటకాలువలను పరిశీలించారు. తరువాత దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల్లోని స్వర్ణముఖి కరకట్టలను పరిశీలించారు. నది కట్టలు బలహీనంగా ఉండటంతో తక్షణ చర్యలు చేపట్టాలని తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్ఐ పవన్‌కుమార్‌లను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, షేక్ జలీల్ అహ్మద్, తిరుమలశెట్టి కోటేశ్వరరావు, దారా సురేష్, మస్తాన్‌బాషా, నౌషాద్, షంషుద్దీన్ తదితరులు ఉన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది: విజయశ్రీ



వాటంబేడుకుప్పం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వాటంబేడు, వాటంబేడు కుప్పం, కారిజాత, కాదలూరు గ్రామాల్లో ఆమె పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, నష్టాలను పరిశీలించారు. వాటంబేడు గ్రామంలో సరైన రోడ్లు లేకపోవడంతో బురదలోనే రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. అక్కడ నుంచి కారిజాత, కాదలూరు గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను, కాదలూరు, వెండ్లూరుపాడు రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీటిని పరిశీలించారు. వరద తగ్గేవరకు రాకపోకలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్, నాయకులు సెల్వం, సుదర్శన్, పళణి, వేలూరు చంద్రయ్య, జయపాల్, ఏకాంబరం తదితరులు ఉన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక షాదీ మంజిల్‌లో రెడ్‌సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగుల దినోత్సవం, క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎందులోనూ తీసిపోరని, అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. దివ్యాంగులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆర్టీసీ ఉచిత బస్సు పాసులను అందజేశారు. పట్టణానికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు అన్వేష్‌ను అభినందించారు. బ్యాంకులో ఉద్యోగాలు పొందిన ఇద్దరిని సత్కరించారు. కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, సంస్థ ప్రతినిధులు జానా సుధీర్, రాజేష్, కోడిపర్తి శ్రీధర్, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకునేందుకు చర్యలు



మగ్గం గుంటలను పరిశీలిస్తున్న వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి విజయానంద్, తెలుగు మహిళ మట్టం శ్రావణి

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా మగ్గం గుంటల్లో నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు చేపడతామని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని చేనేత కార్మికుల మగ్గాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల కారణంగా మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో సుమారు 250 కుటుంబాలకు పనులు లేక ఇబ్బందులు పడాల్సివచ్చిందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సూచనల మేరకు వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి విజయానంద్ నష్టాలను పరిశీలించడం జరిగిందన్నారు. నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి చేనేత కార్మికులకు సాయం అందించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్.శ్రీనివాసులు, రాజనాల, కే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తాం

ఏఐసీసీ కార్యదర్శి సుధా రామకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న సుధా రామకృష్ణన్, పక్కన మాజీ ఎంపీ చింతా మోహన్ తదితరులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఏపీలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకురాలు సుధా రామకృష్ణన్, మాజీ ఎంపీ చింతా మోహన్ ఉద్ఘాటించారు. బుధవారం పట్టనంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వెంకటగిరి నియోజవర్గం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటీ, ఐసర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను విభజన చట్టంలో పెట్టి తిరుపతికి తీసుకువచ్చామన్నారు. కూటమి ప్రభుత్వం మన్నవరం బెల్ ఫ్యాక్టరీ, దుగరాజపట్నం ఓడరేవు పనులను విస్మరించదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో యార్లపల్లి గోపీగౌడ్, మదన్‌మోహన్‌రెడ్డి, పంటా శ్రీనివాసులు రెడ్డి, బాలగురువం బాబు, పూల చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వీడని వాన

- గ్రామాలు జలమయం
- నీటమునిగిన పొలాలు
- రోడ్లు, చప్టాలపై వరద
- ఆగిన రాకపోకలు



చిల్లకూరు మండలం పారిచెర్లవారిపాళెం సమీపంలో చప్టాపై వరద



గూడూరు మండలం విందూరు సమీపంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల నుంచి వీడని వానతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. బుధవారం ఉదయం తేలికపాటి జల్లులు పడినా మళ్లీ సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం, సాయినగర్ ముంపు ప్రాంతాలను తహసీల్దారు గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. మన్నెముత్తేరి - ఉల్లావడవ మార్గంలో వంతెనపైకి వర్షపునీరు చేరింది. కాళంగి రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో భారీగా వరదనీరు చేసి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలో అన్ని చెరువులు నిండుకుండలను తలపిస్తూ ప్రమాదపుటంచుకు చేరాయి. ముందు జాగ్రత్తగా మంగళంపాడు చెరువుకు రైతులు గండికొట్టి నీటిని బయటకు పంపిస్తున్నారు. అధికారులు మాత్రం అన్ని గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. మంగళంపాడు - ఇలుపూరు మధ్య దొండకాలువ వంతెనపై వర్షపునీరు రెండు అడుగుల మేర నీరు పారుతుండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు.

పెళ్లకూరు: దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం మండలంలో భారీ వర్షం కురిసింది. మండలంలోని స్వర్ణముఖినది, మామిడికాలువతో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. స్వర్ణముఖినది లోతట్టు ప్రాంతాలైన కలవకూరు, యడపూడి, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పాలచ్చూరు, జంగాలపల్లి, కప్పగుంటకండ్రిగ, దిరసనమాల తదితర గ్రామాలు జలమయం అయ్యాయి. ఇళ్ల చుట్టూ నీళ్లు ఉండడంతో బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. వందలాది ఎకరాల్లో వరిపైరు నీట మునిగింది. పాలచ్చూరు మామడికాలువ, కలవకూరు కాజ్‌వేలను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ హరికృష్ణ పరిశీలించారు. ఆయా కాజ్‌వేలపై రాకపోకలను నిషేధించారు. పాలచ్చూరు గ్రామంలో ఓజిలి మణెమ్మకు చెందిన రేకుల ఇల్లు కూలిపోయింది. అలాగే నెలబల్లి చెరువుకట్ట బలహీన పడడంతో ఇరిగేషన్ డీఈ కిలారి విశ్వనాథ్, ఏఈ బొప్పన శ్రీనివాస్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, సాగునీటి చెరువు ఆయకట్టు చైర్మన్ చిల్లకూరు మాధవరెడ్డి, కురిమేటి ఉదయ్ నాయుడు పరిశీలించారు. ఇసుక బస్తాలు వేసి మరమ్మతులు చేపట్టారు.

నాయుడుపేట టౌన్: ఎడతెరపిలేని వర్షంతో ఎగువప్రాంతం నుంచి స్వర్ణముఖి, మామిడికాలువకు భారీగా వరదనీరు చేరుతోంది. చెరువులు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నాయి. ఇలాగే వర్షం కొనసాగితే చెరువులకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలోని విన్నమాల రహదారి, రాజగోపాల పురం, అగ్రహారపేట రోడ్లు జలమయమయ్యాయి. కాపులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి భారీగా వర్షపునీరు చేరుకోవడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు.



నాయుడుపేట: కాపులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి వర్షపునీరు చేరడంతో బయటకెళ్లడానికి విద్యార్థుల ఇబ్బందులు

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖి వంతెనపై నీరు ప్రవహిస్తుండడంతో 16 గ్రామాలకు రాకపోకలకు ఆగిపోయాయి. తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ ఎక్స్‌కవేటర్ సాయంతో వంతెనకు ఇరువైపులా మట్టి పోయించారు. రొయ్యల కాలువ ఉప్పొంగడంతో ముట్టెంబాక నుంచి చిట్టమూరుకు వెళ్లే రోడ్డు కోతకు గురైంది. వరదనీటి కారణంగా ముట్టెంబాక, దుగ్గవరం, తిరుమూరు, వావిళ్లపాళెం, కల్లూరు కొత్తపాళెం, కొండూరు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి. దుగరాజపట్నం కొండూరుపాళెం, వావిళ్లపాళెం - కొండూరుకు రహదారులపై వరద ప్రవాహం కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. స్వర్ణముఖి బ్యారేజీని ఇరిగేషన్ ఈఈ బాబు పరిశీలించారు. 14వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండటంతో 11 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నామని ఈఈ తెలిపారు.

దొరవారిసత్రం: దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలాన్ని వర్షం ముంచెత్తింది. మంగళవారం రాత్రి, బుధవారం భారీ వర్షం కురవడంతో కాళంగి నది, కన్నకాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తనియాలి వద్ద కాళంగి నది వంతెనపై వరదనీరు ప్రవహిస్తుండడంతో తనియాలి, కమ్మకండ్రిగ, బూదూరు, మంగానెల్లూరు, తిమ్మనాయుడు కండ్రిగకు రాకపోకలు ఆగిపోయాయి. అలాగే కుప్పారెడ్డిపాలెం సమీపంలో వెదురుపట్టు రోడ్డులో పాలకాలువ వంతెనపై వరద ప్రవాహంతో అవతల వైపునున్న గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పూలతోట సమీపంలో ఉన్న కన్నకాలువ వంతెనపై వరద ప్రవాహంతో సూళ్లూరుపేట - కోట మార్గాల వైపు రాకపోకలు ఆగిపోయాయి.

కోట: భారీ వర్షాలతో మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలు అతలాకుతలమైపోయాయి. గోవిందపల్లి వద్ద ఉన్న బకింగ్‌హమ్ కెనాల్‌లో ఆటుపోటులు పెరిగి రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో మత్స్యకార గ్రామానికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో మత్స్యకారులకు ఎప్పటికప్పుడు సహాయ సహకారాలు అందిస్తున్నారు. అదే విధంగా వెంకన్నపాళెం, తిమ్మానాయుడుపాళెం, కాకితోపు, తిన్నెలపూడి, కొక్కుపాడు గ్రామాల్లోని వరి నారు మడులు, పైర్లు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గూడలి, తిన్నెలపూడి వద్ద ఉన్న స్వర్ణముఖినది, మామిడికాలువలు వరదతో పరవళ్లు తొక్కుతూ ఉప్పొంగుతున్నాయి. రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల మధ్య మామిడికాలువ ఉప్పొంగడంతో ఆ గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. చెందోడు సబ్‌స్టేషన్ జలదిగ్బంధంలో చిక్కుకుంది. వెంకన్నపాళెం, రాఘవాపురం, కేశవరం గ్రామాల్లో సాగులో ఉన్న పుచ్చ, వంగ పంటలు దెబ్బతిన్నాయి. కోట క్రాస్‌రోడ్డులోని మిల్లులో నిల్వ ఉంచిన వందలాది టన్నుల బియ్యం తడిచిపోయాయి. కోట మండలంలోని స్వర్ణముఖినది పొర్లుకట్టలు బలహీనపడి తెగిపోయే ప్రమాదం ఉండటంతో అల్లంపాడు, పుచ్చలపల్లి, దైవాలదిబ్బ, దొరువుకట్ట గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ భయం గుప్పెట్లో ఉన్నారు. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ సురక్షిత ప్రాంతాలకు వెళ్లలేదు. దీంతో దైవాలదిబ్బ గ్రామస్తులను బలవంతంగా కోటలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు తరలించారు.

గూడూరు: తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు రావడంతో పాటు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయడంతో పంబలేరు వాగు పొంగి ప్రవహించింది. మండలంలోని విందూరు, వేములపాళెం చప్టాలపై వరదనీరు ప్రవహించడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. దీంతో మిటాత్మకూరు, ఈదలపల్లి, పగడాలపల్లి, సంతదాసుపల్లి, చంబడిపాళెం, రామలలింగాపురం, విందూరు గ్రామాల నుంచి గూడూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పట్టణంలోని పంబలేరు చప్టాపై వరదనీరు ఉధృతంగా ప్రహిస్తోంది. ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేసి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలోని విందూరు, మిటాత్మకూరు, సంతదాసుపల్లి, పట్టణంలోని పంబలేరు సమీపంలోని, చల్లకాలువ సమీపంలోని పంటపొలాల్లోకి వరదనీరు చేరింది. ప్రస్తుతం నార్లు పోసివుండడంతో ఇక ముందు వర్షాలు పడితే నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. విందూరు గ్రామంలోని ముస్లిం వీధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్ స్థంభం విరిగి పడడంతో ఓ ఆటో ముందు ధ్వసమైంది.

చిల్లకూరు: మండలంలోని తిప్పగుంటపాళెం, పారిచెర్లవారిపాళెం చప్టాలపై వరదనీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు నుంచి ప్రవహించే పంబలేరువాగు తిప్పగుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరులో కలిసి గుమ్మళ్లదిబ్బ సముద్రంలోకి చేరుతుంది. తిప్పగుంటపాలెం చప్టాపై నీరు ప్రవహించడంతో ఆ గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. అధికారులు బోట్లును అడ్డుగా పెట్టి రాకపోకలను నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తుండడంతో పారిచెర్లవారిపాళెం సమీపంలోని చప్టాపై నీరు ప్రవహిస్తోంది. తహసీల్దారు శ్రీనివాసులు చప్టాను పరిశీలించారు. ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలను నిలిపివేసి భారీ వాహనాలు మాత్రమే అనుమతిస్తున్నారు. పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి.

వెంకటగిరి టౌన్: దిత్వా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని కైవల్యానది ఉధృతంగా ప్రవహిస్తోంది. వెలుగొండల అడవుల్లో నుంచి వచ్చే వరదతో కైవల్యానది ప్రవాహం ఎక్కువగా ఉంది. అధికారులు లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. మరో రెండు రోజుల పాటు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సీఐ రమణ, తహసీల్దార్ నరసింహారావు కోరారు.

తడ: దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం తడలో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి చెదురుమదురుగా జల్లులు కురవగా, బుధవారం సాయంత్రం తరువాత భారీ వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మాంబట్టు, వెండ్లూరుపాడు, కారిజాత, కాదలూరు, వాటంబేడు, గ్రద్దగుంట, కొండూరు గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల వరకు వరిపంట నీళ్లలోనే ఉండిపోయింది. పూడి గ్రామంలో వర్షపునీరు రోడ్లపై నిలిచిపోవడంతో జాతీయ రహదారి అధికారులు నీటిని మళ్లించే ప్రయత్నం చేశారు. పెరియవట్టు రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీళ్లు చేరడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. కారిజాత చెరువుకు గండిపడింది. బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చెరువు కలుజుకు ఆనుకొని ఉన్న కట్ట తెగిపోయింది. చెరువులోని నీళ్లు పొలాలమీదుగా పులికాట్‌లోకి వెళ్తున్నాయి.



సూళ్లూరుపేట: దొండకాలువ వంతెనపై వరదనీరు ప్రవహిస్తుండడంతో మంగళంపాడు గ్రామస్తుల అవస్థలు







తడ మండలంలోని కాదలూరు, వాకాడు మండలంలోని కోడివాక వద్ద నీటి మునిగిన పొలాలు - కోట మండలం తిమ్మానాయుడుపాళెం వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటాలు సాగిస్తామని జేఏసీ కన్వీనర్ దశరథరామిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక రోటరీ భవన్‌లో గూడూరు జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఉద్యమాన్ని తీసుకువెళతామన్నారు. 20 రోజులపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేలా కార్యచరణను రూపొందించామని తెలిపారు. మొదటిగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని పట్టనంలోని ముత్యాలపేట సెంటర్‌లో బుధవారం ప్రారంభించామన్నారు. నియోజకవర్గం నుంచి 10వేలు పోస్టుకార్డులను పంపించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే అధికారుల అనుమతితో స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లో శాంతియుత నిరాహారదీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వారిని ఆహ్వానించి నెలరోజుల పాటు రిలేదీక్షలు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హమీలను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో శంకర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, శశికుమార్, మణి, చంద్రయ్య, జమాలుల్లా, నారాయణ, సునీల్, సిసింద్రి, గౌస్‌బాషా పాల్గొన్నారు.

దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

తహసీల్దారు కార్యాలయ సమీపంలోనే ఆక్రమణ
చోద్యం చూస్తున్న అధికారులు
ఎమ్మెల్యే జోక్యంతో చర్యలకు ఉపక్రమణ



ప్రభుత్వ స్థలానికి కంచె వేసిన ఆక్రమణదారులు

వెంకటగిరి, డిసెంబర్ 3(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని అమ్మవారిపేట సర్వే నంబర్ 215లో ఉన్న సుమారు 30 సెంట్ల ప్రభుత్వ అనాదీన భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కంచె వేశారు. దీనిపై డక్కిలి మండలం లింగసముద్రం మాజీ సర్పంచ్ వేముల నాగయ్య నాయుడు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో బుధవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి కంచె వేసినా రెవెన్యూ సిబ్బంది స్పందించడం లేదని ఎమ్మెల్యే ఎదుట నాగయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే పట్టణంలో విలువైన స్థలాన్ని కబ్జా చేస్తుంటే ఏం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. కబ్జాకు గురైన స్థలంలో ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను వెంటనే తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని తహసీల్దారు నరసింహారావును, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని ఆదేశించారు. కాగా, ఈ విషయమై తహసీల్దారు స్పందిస్తూ ఆక్రమణకు గురైన అమ్మవారి పేట సర్వే నంబర్ 215లోని భూమి రెవెన్యూ పరిధిలోని రాదని తెలిపారు. అలాగే మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా సదరు స్థలంతో తమ శాఖకు సంబంధం లేదని, అయినప్పటికీ పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణలను తొలగించేందుకు గురువారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపు దివ్యాంగుల ఉద్యోగ మేళా

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5న దివ్యాంగుల ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ తెలిపారు. 18నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి శారీకర, వినికిడి లోపం ఉన్న దివ్యాంగులు జాబ్ మేళాలకు హాజరుకావచ్చన్నారు.

6న డీఆర్‌డబ్ల్యు కళాశాలలో...

గూడూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక షాదీమంజిల్‌లో జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 15పైగా బహుళజాతి కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. 5వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన వారు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9700561225, 8639835953 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చెన్నయ్య, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార పొట్లాల అందజేత

సూళ్లూరుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాపూజీ కాలనీలో గిరిజనులకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ఆహార పొట్లాలు అందజేశారు. తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, టీడీపీ జిల్లా అధికారి ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు చిట్టేటి పెరుమాల్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, మునస్వామి, శ్రీధర్, వెంకీ యాదవ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

పెళ్లకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి నాటే సమయం నుంచి సస్యరక్షణ చర్యలు పాటించాలని తిరుపతి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త భార్గవరామిరెడ్డి సూచించారు. వ్యవసాయశాఖ, ఆత్మ సౌజన్యంతో నాయుడుపేట డివిజన్ ఏడీఏ నాగార్జునసాగర్ ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలంలోని నెలబల్లి రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి విజయ భారతి, వీఏఏ సుమతి, స్వర్ణముఖి నది ఆనకట్ట ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, సాగునీటి సంఘం అధ్యక్షుడు చిల్లకూరు మాధవరెడ్డి, సర్పంచు కమలమ్మ, టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమ నాయుడు, కురిమేటి ఉదయ్‌కుమార్ నాయుడు, ఎల్లంకి నరేంద్రనాయుడు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్త పరీక్షలు

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మినీ గురుకులంలో విద్యార్థినులకు శ్రీకృష్ణసేవాసమతి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ సహకారంతో ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ టెస్టులు నిర్వహించారు. కార్యక్రమంలో రజనీకుమారి, మస్తానయ్య, దినేష్‌రెడ్డి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్, ప్రిన్సిపాల్

కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. 40మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ప్రాంగణ ఎంపికల అధికారి కిషొంధర్ అభినందించారు.